RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in




EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:91 THURSDAY ,SEPTEMBER 02,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :91 గురువారం, సెప్టెంబర్ 10, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# శాసనసభ నుంచి 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సస్పెండ్.!



### హరీశ్‌రావు, కేటీఆర్ సహా 22 మందిపై సస్పెన్షన్ వేటు

- సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారంటూ స్పీకర్ నిర్ణయం
- శ్రీధర్‌బాబు తీర్మానానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆమోదం
- సెషన్ మొత్తం సమావేశాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరం
- 'వి వాంట్ జస్టిస్' నినాదాలతో అసెంబ్లీలో గందరగోళం
- స్పీకర్ ఛాంబర్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్న మార్షల్స్
- సస్పెన్షన్ అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో ఉద్రిక్తత

**ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు** 2

తెలంగాణ పత్రిక :తెలంగాణ పత్రిక ప్రతినిధిశాసనసభ మూడో రోజు సమావేశాల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. సభా కార్యకలాపా లకు నిరంతరం ఆటంకం కలిగిస్తున్నారనే కారణ ంతో హరీశ్‌రావు, కేటీఆర్‌లతో సహా మొత్తం 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల (సెషన్) కాలమంతటికీ ఈ సస్పెన్షన్ వర్తిస్తుందని ఆయన ప్రకటించారు. ఉదయం సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు ఒక్క సారిగా పోడియం వైపు దూసు కెళ్లారు. "వి వాంట్ జస్టిస్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా నిర్వహణను అడ్డుకున్నారు. ప్రతి పక్ష సభ్యుల వరుస నినాదాల మధ్య సభ సజా వుగా సాగకపోవడంతో శాసనసభ వ్యవహా రాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకున్నా రు. నిరసన తెలుపుతున్న మిగతా2లో



## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర నుంచి అసెంబ్లీ దాడుల వరకు... 3 రోజుల వరుస ఘటనలపై సమగ్ర విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం..

### దోషులు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

తెలంగాణ పత్రిక ప్రతినిధి: శాసనసభలో బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించిన తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ పదవిని అవమానిస్తూ మాట్లాడిన వారు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన భేటీ నుంచే ఈ కుట్రలన్నీ మొదలయ్యాయని, గత మూడు రోజులుగా జరిగిన వరుస ఘటనల వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులను చట్టం ముందు దోషులుగా నిలబెడతామని స్పష్టం చేశారు. అంటరానితనం, కులవివక్ష, అణచివేత చర్యలను తమ ప్రభుత్వం ఎంతమాత్రమూ ఉపేక్షించదని హెచ్చరించారు. శాసనసభ ప్రాంగణంలో అంటరానితనం ప్రదర్శించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు సీనియర్ అధికారి విజయ్‌కుమార్‌ను 2లో



## గవర్నర్‌ను కలిసిన కేటీఆర్

### శాసనసభ్యులపై పోలీసుల దాడి దుర్మార్గం గవర్నర్‌కు బీఆర్ఎస్ బృందం ఫిర్యాదు..

- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత

తెలంగాణ పత్రిక ప్రతినిధి: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని, ప్రజాప్రతినిధులపైనే పోలీసులు దాడులకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రాజ్ భవన్‌లో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది.

## కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు



- కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్
- కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎం రేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి
- హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని వ్యాఖ్య
- సిరిసిల్లలో సీఎం రేవంత్‌కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు
- కేసీఆర్‌కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉందని వివరణ

తెలంగాణ పత్రిక ప్రతినిధి: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. మిగతా2లో



## ఇందిరమ్మ ఇళ్ల డిపాజిట్ సొమ్ము రీఫండ్

### మీసేవ ద్వారా కట్టిన వారికి ప్రభుత్వం కీలక సూచన..

- తొలి విడత ఇళ్ల పరిశీలన వేగవంతం
- త్వరలోనే పనులు ప్రారంభం
- అల్పాదాయ వర్గాల కోసం 10 అంతస్తుల టవర్లు

తెలంగాణ పత్రిక ప్రతినిధి :ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపిక కాకపోయిన దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ.10 వేల డిపాజిట్ మొత్తాన్ని తెలంగాణ హౌసింగ్ బోర్డు తిరిగి చెల్లిస్తోంది. ఆన్‌లైన్‌లో సొంత ఖాతాల ద్వారా చెల్లించిన వారి డబ్బులు నేరుగా ఆయా ఖాతాల్లోనే జమవుతాయని, వీరు ప్రత్యేకంగా ఎలాంటి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని బోర్డు వైస్ మిగతా2లో



## E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

- E20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు

తెలంగాణ పత్రిక :ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచార ంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 2లో

## సొంత మహిళా ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నేతలే తోసేశారు



- అసెంబ్లీ ఘటన వివాదంలో కొత్త కోణం
- సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేలను తోసేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మంత్రి సీతక్క ఆరోపణ
- గాయపడిన మహిళా పోలీసులను పరామర్శించిన సీతక్క

తెలంగాణ పత్రిక :తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు మిగతా2లో

## శాసనమండలి నుంచి బీఆర్ఎస్ వాకౌట్

### ఎథిక్స్ కమిటీ విచారణకు ఇద్దరి నేతల వ్యవహారం

- తాతా మధు, నవీన్ రెడ్డిలను సభ నుంచి సస్పెండ్ చేసిన మండలి ఛైర్మన్
- సస్పెన్షన్ తీర్మానంపై డివిజన్ ఓటింగ్ నిర్వహించాలన్న బీఆర్ఎస్ సభ్యులు

తెలంగాణ పత్రిక :తెలంగాణ శాసనమండలిలోనూ రాజకీయ సెగలు తీవ్ర స్థాయికి చేరాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, మిగతా2లో



## తెలుగు రాష్ట్రాలకు రైల్వే శుభవార్త..

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్‌కు గ్రీన్ సిగ్నల్
- అరక్కోణం-రేణిగుంట మధ్య 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం
- మూడు ప్రాజెక్టుల కోసం రూ. 10,021 కోట్లు కేటాయింపు
- ఏపీ, తెలంగాణలో రైల్వే సామర్థ్యం పెంచడమే లక్ష్యం

2

## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

2

- యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
- రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే బండి సంజయ్
- కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని వ్యాఖ్య
- పోలీసుల కేసులకు భయపడాల్సిన అవసరం లేదన్న సంజయ్

# శాసనసభ నుంచి 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సస్పెండ్.!

నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేయాలని కోరుతూ తీర్మానాన్ని ప్రతిపాదించారు. మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదనకు స్పీకర్ ఆమోదం తెలుపుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు.

**సస్పెండ్ అయిన వారిలో ముఖ్య నేతలు**

సస్పెన్షన్‌కు గురైన వారిలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావుతో పాటు జీవన్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, దేవరెడ్డి సుధీర్‌రెడ్డి, వి. సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, డాక్టర్ కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద ఉన్నారు.

**స్పీకర్ ఛాంబర్ వద్ద ఉద్రిక్తత**

సస్పెన్షన్ ప్రకటన అనంతరం స్పీకర్‌ను కలిసి తమ నిరసనను విన్నవించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను శాసనసభ వద్ద మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నిర్ణయంతో బీఆర్ఎస్ సభ్యులు ఈ సెషన్ మిగిలిన సమావేశాలకు పూర్తిగా దూరంగా ఉండనున్నారు.

# ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు

తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.

# శాసనసభ్యులపై పోలీసుల దాడి దుర్మార్గం గవర్నర్‌కు బీఆర్ఎస్ బృందం ఫిర్యాదు..

రాజ్ భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై రాతపూర్వక ంగా ఫిర్యాదు చేసింది. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నడిరోడ్డుపై శాసన సభ్యులపై పోలీసులు దాడి చేసిన దృశ్యాలు, ఆధారా లను గవర్నర్‌కు సమర్పించారు. మహిళా ఎమ్మెల్యే లపై అనుచిత ప్రవర్తన: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై పోలీసులు దాడికి దిగడం, అలాగే సునీతా మహేందర్ రెడ్డి చీర లాగి పరాభవి ంచడా న్ని ప్రత్యక్ష ఆధారాలతో గవర్నర్ దృష్టికి తీసుకెళ్లా రు. బాధితులపైనే అక్రమ కేసులు: దాడు లకు గురైన తమ ప్రజాప్రతినిధులపైనే పోలీసులు తిరుగు కేసులు నమోదు చేయడాన్ని బీఆర్ఎస్ బృందం నిరసించింది. నిర్లక్ష్యంగా పోలీసు కమిష నరేట్: ఈ దాడులపై స్వయంగా పోలీసు కమిషనర్ కార్యాల యానికి వెళ్లి ఫిర్యాదు చేసినప్పటికీ, ఇంత వరకు ఎలాంటి కేసులు నమోదు చేయలేదని వెల్లడి ంచారు. గవర్నర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు ఉన్నా రు. ప్రజాస్వా మ్యంలో ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే సామా న్యుల పరిస్థితి ఏంటని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ ఘటనల పై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు.

# కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోల ేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమా ర్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తు న్నారని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు సీఎం స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. సీఎం తర్వాత రాష్ట్రంలో అత్యధిక భద్రత పొందుతు న్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంతవరకు సమంజసమని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. స్పీకర్ పదవిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలపైనా ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను తెలంగాణ సమాజం ఖండిస్తోందన్నారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని చెప్పారు. కేసీఆర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల డిపాజిట్ సొమ్ము రీఫండ్

మీసేవ కేంద్రాల ద్వారా నగదు రూపంలో చెల్లించిన వారు లేదా ఇతరుల అకౌంట్ల నుంచి ఫీజు కట్టిన వారు మాత్రం వెంటనే తమ సొంత బ్యాంక్ ఖాతా వివరాలను ¯స్త్రష్టవ్.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.ఆఅ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ నెల 10వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.

**తొలి విడత ఇళ్ల పరిశీలన వేగవంతం**

తొలి విడతలో భాగంగా నిర్మించనున్న 7,340 ఇళ్లకు లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారుల వివరాల పరిశీలన వేగంగా జరుగుతోంది. హౌసింగ్ బోర్డు సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి వివరాలను సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత మిగతా మొత్తం ఏ విధంగా చెల్లించాలో కేటాయింపు లేఖలో స్పష్టంగా పేర్కొంటామని అధికారులు వెల్లడించారు. ఇక చాంద్రాయణగుట్ట, ఎల్‌బీనగర్, ముషీరాబాద్, గోషామహల్ నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 10వ తేదీ ఆఖరు అని తెలిపారు.

**త్వరలోనే పనులు ప్రారంభం**

హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల్లో స్థలాల సేకరణ, టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, మరో రెండు రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏడాది వ్యవధిలోనే నిర్మాణం పూర్తి చేసి, ఉచిత రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులైన మహిళల పేరిటే ఇళ్లను అందిస్తామని చెప్పారు. ఇల్లు కేటాయించిన పదేళ్ల తర్వాతే విక్రయించుకునే హక్కు ఉంటుందని, అత్యవసర సమయాల్లో తాకట్టు పెట్టుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

**అల్పాదాయ వర్గాల కోసం 10 అంతస్తుల టవర్లు**

గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలోని 26 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పేద, అల్పాదాయ వర్గాల కోసం లక్ష ఫ్లాట్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి టవర్‌లో 10 అంతస్తులు, అంతస్తుకు 12 ఫ్లాట్ల చొప్పున ప్రభుత్వ స్థలాల్లోనే ఈ నిర్మాణాలు చేపట్టనున్నారు. పారదర్శకమైన లాటరీ పద్ధతిలోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.

# ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన..

ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

# సొంత మహిళా ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ నేతలే తోసేశారు

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర నుంచి అసెంబ్లీ దాడుల వరకు... 3 రోజుల వరుస ఘటనలపై సమగ్ర విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం..

సమగ్ర విచారణ జరిపేందుకు సీనియర్ అధికారి విజయ్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఫామ్‌హౌస్‌లో కుట్ర పన్నిన వారిని, దాన్ని సభలో అమలు చేసిన వారిని ఏ ఒక్కరినీ వదలకుండా క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శనలు చేస్తూ మహిళా ప్రజాప్రతినిధులను, మహిళలను ఇబ్బంది పెట్టిన ఘటనలపైనా, విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిపై జరిగిన దాడులపైనా పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు సీఎం తెలిపారు. తెరవెనుక ఉండి సూచనలు చేసిన పెద్దల నుంచి, నేరుగా దాడికి పాల్పడిన వారి వరకు అందరి వివరాలు సేకరిస్తున్నామని, చట్ట ప్రకారం ప్రతి ఒక్కరికీ శిక్ష పడేలా చూస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# శాసనమండలి నుంచి బీఆర్ఎస్ వాకౌట్..

తెలంగాణ శాసనమండలిలోనూ రాజకీయ సెగలు తీవ్ర స్థాయికి చేరాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలను మిగిలిన సమావేశాల కాలానికి సస్పెండ్ చేయడం మండలిలో దుమారం రేపింది. మండలిలో ఈ ఇద్దరు సభ్యుల సస్పెన్షన్ ప్రతిపాదనపై ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టగా... దానిపై 'డివిజన్ ఓటింగ్' నిర్వహించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. అయితే ఓటింగ్‌కు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరాకరించడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణిని ఖండిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. మరోవైపు, అసెంబ్లీ గేటు వద్ద నిరసనల సందర్భంలో శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పాటు మహిళల ఎదుట దుస్తులు విప్పి నిరసన తెలిపారనే కారణాలతో వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని ఎథిక్స్ కమిటీకి మండలి ఛైర్మన్ రిఫర్ చేశారు.

## తెలుగు రాష్ట్రాలకు రైల్వే శుభవార్త.. కొత్త లైన్లకు కేంద్రం ఆమోదం

రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు.కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్–కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం–రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి.

## తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని,



ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు.

# SBIలో ఖాతాదారుల అవస్థలు.. సమస్యలు పరిష్కరించేది ఎవరు

బొంరాస్ పేట్ తెలంగాణ పత్రిక

మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బొంరాస్‌పేట్ శాఖలో ఖాతాదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుకు ఉదయం 10.30 గంటలకు వచ్చినా తమ పని పూర్తయ్యేలోపు సాయంత్రం అవుతోందని, ఒక్కో పనికి పలుమార్లు బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు. సిబ్బంది కొరత, పనుల జాప్యం కారణంగా రోజంతా బ్యాంకులోనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు.



**రుణ వివరాల కోసం రైతుల ఇబ్బందులు**

రైతులు తమ రుణానికి సంబంధించిన అసలు, వడ్డీ ఎంత? ఎంత చెల్లించాలి? ఇంకా ఎంత బకాయి ఉంది? వంటి వివరాలు తెలుసుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఖాతాదారులు చెబుతున్నారు. రుణానికి సంబంధించిన పనుల కోసం పలుమార్లు బ్యాంకుకు వచ్చినా స్పష్టమైన సమాచారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రుణం కావాలంటే డిపాజిట్.. బీమా ఎందుకు?**

కొత్తగా రుణం పొందే సమయంలో డిపాజిట్ చేయాలని, బీమా తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రైతులకు బీమా విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. రుణం మంజూరుకు బీమా తప్పనిసరా? అనే విషయంపై బ్యాంకు అధికారులు స్పష్టత ఇవ్వాలని ఖాతాదారులు కోరుతున్నారు. బీమా సేవలు, రుణ సేవలకు సంబంధించిన నిబంధనలను పారదర్శకంగా వివరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**మేనేజర్ అందుబాటులో ఉండరని ఫిర్యాదు**

బ్యాంకు మేనేజర్ సీటు తరచూ ఖాళీగా కనిపిస్తోందని కొందరు ఖాతాదారులు చెబుతున్నారు. సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు, తమ పనుల గురించి ఉన్నతాధికారిని సంప్రదించేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ప్రతి ఉద్యోగి తనకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఖాతాదారులతో గౌరవంగా వ్యవహరించాలి**

బ్యాంకుకు వచ్చే ఖాతాదారులతో సిబ్బంది మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వినియోగదారులు కోరుతున్నారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చినప్పుడు సరైన స్పందన లేకపోవడం, ఒక పని కోసం పలుమార్లు తిరగాల్సి రావడం వల్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సమయంలో ఖాతాదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండకూడదని అంటున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

బొంరాస్‌పేట్ వాదీ× శాఖలో సిబ్బంది పనితీరు, ఖాతాదారులకు అందుతున్న సేవలు, రుణాల వివరాల విషయంలో ఎదురవుతున్న సమస్యలు, బీమా విషయంలో వస్తున్న ఫిర్యాదులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఖాతాదారులు కోరుతున్నారు. బ్యాంకులో అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసి, ప్రతి పని నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఖాతాదారుల సమస్యలను స్వీకరించి వెంటనే పరిష్కరించే విధంగా ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఖాతాదారులు కోరుతున్నారు.

# రజక సంఘం లబ్ధిదారులకు వాషింగ్ మిషన్ లు అందజేత

**-బిజెపి మండల అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో**

కోటగిరి తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9.

కోటగిరి మండల కేంద్రంలోని తపాలా కార్యాలయం వద్ద ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కార్యక్రమంలో భాగంగా రజాక సంఘం లబ్ధిదారులకు కోటగిరి పోతంగల్ మండలాలకు చెందిన 16 మందికి లబ్ధిదారులకు వాషింగ్ మిషిన్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వేముల నవీన్ మాట్లాడుతూ..... రజక సంఘంలోని పేద కుటుంబాలకు చెందిన



లబ్ధిదారులను గుర్తించి విశ్వకర్మ యోజన పథకం ద్వారా సహాయం అందజేయడంతో వారికి ఆర్థికంగా ఆదుకోవడం జరిగిందన్నారు. లబ్ధి పొందిన కుటుంబ యజమానులు భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ప్రతేక ధన్యవాదాలు తెలిపారు. వాషింగ్ మిషన్లు వారి జీవనోపాధికి తోడ్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల బిజెపి అధ్యక్షుడు వేముల నవీన్ మాజీ మండల అధ్యక్షులు మామిడి సాయి ప్రసాద్ కట్టు రమేష్ మేత్రి శివరాజ్ తపాల కార్యాలయ సిబ్బంది ప్రేమ్ కుమార్ లక్ష్మణ్ లబ్ధిదారులు మెత్రి శివరాజ్ శివాలాల్ సతీష్ ప్యాట్ల లక్ష్మి సతీష్ వినోద తదితరులు పాల్గొన్నారు.

# మండల పశువైద్య కేంద్రము ఆకస్మిక తనిఖీ

**-జిల్లా పశుసంవర్ధక అధికారి**

పాపన్నపేట, సెప్టెంబర్ 09:(తెలంగాణ పత్రిక)

జిల్లా పశు వైద్య పశుసంవర్ధక శాఖ అధికారి టి. ఆదిత్య వర్మ పాపన్నపేట మండల పశువైద్య కేంద్రమును ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేయడంతో పాటు పశు వైద్య సేవలపై అరా తీశారు మరియు మండల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ముఖ్యంగా పశు వైద్య సేవలను సమర్ధవంతంగా అందించడంతోపాటు టీకాల కార్యక్రమం పటిష్టంగా అమలు పరచడం, పశువైద్య శిబిరాల నిర్వహణ, మరియు కృత్రిమ గర్భాధారణ కార్యక్రమం వాటి ఆన్లైన్ పురోగతిపై వరాలు అడిగి తెలుసుకున్నారు.పశుసంపద అభివృ





ద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు పశు పోషకులకు చేరేలా అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సూచించారు. ఈ సమావేశంలో మండల పశు వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య రెడ్డి డాక్టర్ ప్రవీణ్ కుమార్ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సతీష్ కుమార్, శివాజీ, LSA లు సురేష్, రాకేష్ , సిబ్బంది గోపాల మిత్రులు పాల్గొన్నారు

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే పరిశీలించిన కలెక్టర్

జగిత్యాల రూరల్ (తెలంగాణ పత్రిక) సెప్టెంబర్ 9

జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, తకళ్లపెల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గారు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సర్ ఫారాల్లో నమోదైన తప్పులు, నోటీసుల జారీ, పెండింగ్ కేసులు, సవరణ పూర్తయిన కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల పేరు, ఇంటిపేరు, ఫోటోల్లో



తేడాలు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకుండా పారదర్శకంగా, పకడ్బందీగా వ్యవహరించాలని ఈ ఆర్ ఓ లు,బి ఎల్ ఓ లకు సూచించారు. నోటీసులు జారీ అనంతరం హియరింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం కల్లెడలో వీఆర్వో భవనం, తక్కళ్లపెల్లిలో గ్రామ పంచాయతీ, విఓ భవనాల నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేసి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# దళితులు పాల్గొన్న ప్రదేశాన్ని పాలు పసుపు నీటితో శుద్ధి చేయడం ముమ్మాటికీ కుల వివక్షే

**-కేసీఆర్ దళితులకు క్షమాపణ చెప్పాలని దళిత సంఘాలు డిమాండ్**

**-తాత మధు నవీన్ రెడ్డిలను సస్పెండ్ ను హర్షిస్తున్నాం**

జగిత్యాల, సెప్టెంబర్ 9 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ దుమాల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళిత నాయకులు డప్పులతో నిరసన తెలిపిన అనంతరం బీఆర్ఎస్ నాయకులు ఆ ప్రదేశాన్ని పాలు పసుపు నీటితో శుద్ధి చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. దళితులు పాల్గొన్న ప్రదేశాన్ని ఈ విధంగా శుద్ధి చేయడం ముమ్మాటికీ కుల వివక్షకు నిదర్శనమని దుమాల రాజ్ కుమార్ అన్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేసీఆర్ దళితులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధు



నవీన్ రెడ్డిలను సస్పెండ్ చేయడాన్ని హర్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లారపు గిరిధర్, మద్దెల నారాయణ, దాసరి సతీష్, భూమేష్, కంటే అంజయ్య, కోలేపాక మల్లేష్, కడమంద కమలాకర్, కొంగర పవన్, తడగొండ లక్ష్మణ్, మేక పవన్, నక్క అశోక్, దుమాల కిషోర్, సుద్దాల గంగాధర్, సంపత్ కుమార్, కట్కూరి సురేష్, గిద్దె శంకర్, బాపూరావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తానూర్ లో రైతుల సందడి

తానూర్: 09సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)

ఎడ్ల ప్రతిమలు కొనుగోలు చేస్తున్న రైతులు, అలంకరణ సామాగ్రి దుకాణాల వద్ద ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో దుకాణాల వద్ద రైతుల సందడి నెలకొంది తమ ఎడ్లను పూజించి కొమ్ములకు రంగులు గజ్జలు జూలు (వస్త్రాలు) తదితర అలంకరణ వస్తువులను దుకాణాల వద్ద కొనుగోలు చేస్తూ కనిపించారు.





## సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనం కాళోజి

**-కాళోజి కి ఘన నివాళి**




తానూర్: 09సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ,కళాశాలలో బుధవారం కాళోజి జయంతి పుష్కరించుకొని తెలంగాణ భాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలలో విద్యార్థులకు కాళోజి జీవిత చరిత్ర వివరించారు. కోలూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎం మల్లన్న మాట్లాడుతూ కాళోజి తన రచనల ద్వారా తెలంగాణ సమాజాన్ని జాగృతం చేశారని పేర్కొన్నారు. కాళోజి తెలుగు భాషకు తెలంగాణ యాసకు వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి



పోతంగల్ తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9.

పోతంగల్ మండల కేంద్రంలోని ప్రజా కవి పద్మ విభూషణ్ కాలోజి నారాయణరావు జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవి నాగం సాయిలు మాట్లాడుతూ.... తెలం గాణ ప్రభుత్వం ఆర్థికంగా తెలంగా ణ భాష దినోత్సవం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తన కలంతో బలంతో ప్రజలను ఎంతో చైతన్య పరచడం జరిగిందన్నారు. "పుట్టక నీది చావు నీది బతుకంత దేశానిది" అని చాటి చెప్పిన మహా కవి కాలోజి నారాయణరావు అని గుర్తు చేశారు. ఒక శిరచుక్క లక్ష మెదడుల కదలిక వంటి ఎన్నో గొప్ప కవితలను రాయడం జరిగిందన్నారు. తెలంగాణ యాస భాషల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పడంతో 1992 సంవత్సరంలో భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారాన్ని ఇచ్చి ఆయనకు ఘనంగా సన్మానించడం జరిగిందని కవి నాగం సాయిలు ఒక ప్రకటనలో తెలిపారు.

## నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలు అందించి ఓటును నిర్ధారణ చేసుకోవాలి

**-తాహసిల్దార్ మారుతి రెడ్డి**



గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలోని పోలింగ్ స్టేషన్ పరిధిలో బుధవారం రోజున ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసులు అందిన ఓటర్లు విచారణకు హాజరై ధ్రువీకరణ ప్రక్రియ కోసం ఎన్నికల సంఘం సూచించిన అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటును నిర్దారణ చేసుకోవాలని ఓటర్లను తహసీల్దార్ మారుతి రెడ్డి కోరారు.

## వనరానికి అంత్యక్రియలు



ముధోల్:09సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)

మండలంలోని తరోడ గ్రామ శివారు లో ప్రమాదవశాత్తు మృతి చెందిన కొండముచ్చు (కొండెంగ)కు బజరం గ్ దళ్ యూత్ సభ్యులు హిందూ సాంప్రదాయంగా బుధవారం అం త్యక్రియలు నిర్వహించారు.హిందూ సంప్రదాయంలో కొండముచ్చును హనుమంతుని స్వరూపంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన కొండముచ్చుకు గ్రామ యువకులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. జంతువుల పట్ల ప్రేమ, కరుణతో పాటు ధర్మనిష్ఠను చాటుకున్న యువకుల చర్యను గ్రామస్తులు అభినందించారు. మూగజీవుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో వ్యవహరించాలని, వాటి సంరక్షణ కు ముందుకు రావాలని యువకు లు కోరారు.

## కాళోజీ సేవలు చిరస్మరణీయం



ముధోల్:09సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)

ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని రభీంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్ అన్నారు.బుధవారం ముధోల్‌లోని రబీంద్ర పాఠశాల లో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.సమసమాజ నిర్మాణానికి కాళోజీనారాయణరావు రచనలు, ఉద్యమాల ద్వారా బాటలు వేశారని పేర్కొన్నారు.కాళోజీ జయంతిని తెలంగాణభాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఊపిరిగా భావించిన కాళోజీ.. తెలుగు భాష, ప్రజల హక్కులు,అవసరాల కోసం నిరంతరం కృషి చేశారన్నారు. కాళోజీ సాహిత్యం ప్రజల్లో చైతన్యా న్ని నింపిందని,ఆయన ఆశయాల ను నేటితరం ఆదర్శంగా తీసుకో వాలని సూచించారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్ గంభీరావు పేట పట్టణ కేంద్రంలో ఇటీవల మరణించిన మేకార్తి కృష్ణ కుటుం బాన్ని పరామర్శించి వారి కుమారులకు మనోధైర్యం కల్పించారు అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు డాక్టర్ జంగం రాజు ప్రధమ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి వారి సతీమణితో పాటు కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీ మీకు ఎల్లవేళలా అండగా ఉంటుందని మనోధైర్యాన్ని కల్పిస్తూ ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించే విధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు ఆయన వెంట నాయకులు మల్యాల రాజవీర్ శనిగారపు నరేష్ వర్మ దేశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్ డీ పట్టాను పొందిన రాథోడ్ గణేష్

తానూరు:09సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)



విద్య బోధనతో పాటు పరిశోధన రంగంలో విశే ష కృషి చేసి,హిందీ విభాగ ంలో డాక్టరేట్ పట్టాను తానూరు మండలంలోని బెల్ తరోడ విజేత హైస్కూ ల్ ప్రిన్సిపాల్ రాథోడ్ గణేష్ పొందారు. మంగళవారం హైదరాబాద్ పట్టణంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవ వేడుకల్లో హిందీ సాహిత్యంలో మానవీయ విలువలు, మానవత్వం అనే అంశంపై డాక్టరేట్ ను సాధించాడు. దీంతో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, భారత్ బయోటెక్ సంస్థపకులు డాక్టర్ కృష్ణ ఎమ్ ఎల్లా, విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగు రామ్ చేతుల మీదగా పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యా యులు, బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, గణేష్ ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

-డీజేలకు అనుమతి లేదు
-భజన కార్యక్రమాలతో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలి
-CI చంద్రశేఖర్ రెడ్డి

బొంరాస్‌పేట్ తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 09



మండల కేంద్రంలో రానున్న వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బొంరాస్ పేట్ పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కోడంగల్ CI చంద్రశేఖర్‌రెడ్డి, బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు ఉత్సవాల నిర్వహణ, భద్రత, శాంతిభద్ర తలకు సంబంధించి పలు సూచనలు చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావ ణంలో, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిబంధనలు పాటిస్తూ పోలీస్‌శాఖకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా డీజేలకు అనుమతి లేదని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించే కార్యక్ర మాలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు. డీజేలకు బదులుగా భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాం స్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా యువత అత్యుత్సాహానికి దూరంగా ఉండాలని, మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనడం, వాహనాలు నడపడం చేయకూడదని సూచించారు. మద్యం సేవిం చి గొడవలకు దిగడం, ఇతరులకు ఇబ్బంది కలిగిం చడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడవద్దని తెలిపారు. చిన్నపాటి వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా ప్రతి ఒక్కరూ సంయమ నం పాటించాలని కోరారు. గణేష్ మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. విద్యుత్ వైర్లకు మండపాలు, అలంకరణలు దగ్గరగా ఏర్పాటు చేయకుండా జాగ్రత్త లు తీసుకోవాలని, విద్యుత్ కనెక్షన్ల విషయంలో సం బంధిత అధికారుల సూచనలు పాటించాలని తెలిపా రు. షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు, ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గణేష్ నిమజ్జనం సమయంలో పిల్లలను చెరువులు, నీటి గుంతలు, కాలువలు, ఇతర నీటి ప్రాంతాల వద్దకు ఒంటరిగా పంపవద్దని సూచిం చారు. నిమజ్జన సమయంలో పిల్లలు నీటిలోకి వెళ్లకు ండా తల్లిదండ్రులు, నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకో వాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని, లోతైన ప్రాంతాల్లోకి వెళ్లవద్దని సూచించారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే వారు నిర్వాహకుల సూచనలు పాటించాలని, ప్రమాదకరమైన విన్యాసాలు చేయవ ద్దని తెలిపారు. వాహనాలపై అధిక సంఖ్యలో ప్రయా ణించడం, వేగంగా వాహనాలు నడపడం వంటి చర్య లకు దూరంగా ఉండాలని సూచించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను పార్కింగ్ చేయాలని తెలిపారు. రహదారులను పూర్తి గా ఆక్రమించే విధంగా మండపాలు, అలంకరణలు ఏర్పాటు చేయవద్దని, అత్యవసర వాహనాలు వెళ్లేందు కు అవసరమైన మార్గాలను ఖాళీగా ఉంచాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఇతర మతాలు, వర్గాలు, వ్యక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి వ్యాఖ్యలు, నినాదాలు చేయవద్దని సూచించా రు. సోషల్ మీడియాలో కూడా వివాదాలకు దారితీసే పోస్టులు, వీడియోలు, సందేశాలు ప్రచారం చేయకుం డా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పుకార్లను నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తమ పరిధిలోని కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహిం చాలని, పోలీస్‌శాఖకు అవసరమైన సమాచారాన్ని ముందుగానే అందించాలని అధికారులు సూచించా రు. ఉత్సవాల సమయంలో ఎలాంటి సమస్య తలెత్తినా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. వినాయక చవితి పండుగ భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, భజన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రశాంతమైన వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాల ని సమావేశంలో సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిం చాలని అధికారులు కోరారు. ఈ శాంతి కమిటీ సమావేశంలో మండల డిప్యూటీ తహసిల్దార్ చాన్ పాషా,మండల అధ్యక్షులు నర్సింలు గౌడ్, గ్రంథాల య చైర్మన్ రాజేష్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు జగదీశ్వర్ సాగర్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, జర్నలిస్టులు, విద్యుత్‌శాఖ అధికారులు, బొంరాస్‌పేట్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి

– అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,ప్రతినిధి సెప్టెంబర్ 9 ( తెలంగాణ పత్రిక )





ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి మరువలేనిదని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు.?బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారికంగా నిర్వహించిన కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.?ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందించే వ్యక్తిత్వం కాళోజీది అన్నారు. సత్యాగ్రహ మహోద్యమంలో పాల్గొని పిన్న వయసులోనే జైలు జీవితం గడిపారని తెలిపారు. విద్యార్థి దశ నుండే నిజాం ప్రభుత్వం నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకులు కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని, ప్రజాకవి కాళోజీ రచనలు, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత కాళోజీ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.?ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ,సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావుకు ఘన నివాళి

-జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 112వ జయంతి వేడుకలు
-కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన చైర్మన్ పసుపులేటి వీరబాబు

కొత్తగూడెం సెప్టెంబర్ 09 (తెలంగాణ పత్రిక)





తెలంగాణ విముక్తి కోసం, ప్రజా చైతన్యం కోసం నిరంతరం పోరాడిన ప్రజాకవి, బహుభాషా కోవిదు డు కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడు కలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాల యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కాళోజీ తన రచనలు, కవితల ద్వారా ప్రజల్లో విప్లవాత్మక చైతన్యాన్ని రగిలించారని కొనియాడారు. “పుట్టుక నీది.. చావు నీది.. బతుకం తా దేశానిది” అనే సూక్తిని నిలబెడుతూ తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన మహనీయుడని అన్నారు. 1930ల కాలంలో తెలంగాణ వ్యాప్తంగా సాగిన గ్రంథాలయ ఉద్యమంలో కాళోజీ చురుగ్గా పాల్గొని, ప్రతి గ్రామంలో విజ్ఞాన దీపాలు వెలిగించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. అలాంటి మహాకవి జయంతిని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించుకోవడం గర్వకాం ణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాల కురాలు ఎస్. లలితకుమారి, గ్రేడ్--2 గ్రంథపాల కురాలు జి. మణి మృదుల, విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై జిల్లా షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9







జిల్లాలో విద్యార్థుల భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది ఆగస్ట్ నెలలో షీ టీం కి వచ్చిన ఫిర్యాదులలో 03 కేసులు నమోదు చేసి మహిళలను, విద్యార్థులను వేధిస్తున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్, పోక్సో చట్టం,సోషల్ మీడియా వినియోగం మోసాలు,మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు బుధవారం రోజున గంబిరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గోరంటల , గజసింగవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకి అవగాహన కల్పించి , వేధింపులకు గురైతే వెంటనే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని , నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటా మని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని షీటీమ్ అధికారులు సూచించారు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించ కూడదని , గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమా చారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు ఈకార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల,రవి , సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు

# పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి







-వెంకటాపూర్--ఆరెంద రహదారి విస్తరణ పనులను వెంటనే క్షేత్రస్థాయిలో ప్రారంభించాలి

-ప్రతి విద్యార్థికి కనీస చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు వచ్చేలా బోధించాలి

-విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

-మంథని మండలంలో పలు పాఠశాలలు, రహదారి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 9 ( తెలంగాణ పత్రిక )

పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంథని మండలంలోని ఖాన్‌సాయిపేట ఎంపీపీఎస్ పాఠశాల, భట్టుపల్లి ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, వెంకటాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల, మల్లారం ఎంపీపీఎస్ పాఠశాల, ఆరెంద జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, స్వర్ణపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలను బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, విద్యాబోధన, విద్యార్థుల హాజరు, అభ్యసన స్థాయిపై సంబంధిత అధికారులను, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.వెంకటాపూర్ నుంచి ఆరెంద వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులను వెంటనే క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారి విస్తరణ పనులు పూర్తయ్యే వరకు ప్రస్తుతం ఉన్న రహదారిపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఖాన్‌సాయిపేట ఎంపీపీఎస్ పాఠశాలలో కాంపౌండ్ వాల్, పెయింటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెంకటాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో మంజూరైన అదనపు తరగతి గది నిర్మాణాన్ని నెల రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులు కొత్తగా కల్పించిన సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా నైపుణ్యాలు కల్పించాలి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఉపాధ్యాయులు ఖీచీ (Foundational Literacy and Numeracy) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి విద్యార్థికి కనీసం చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు ఉండేలా బోధన అందించాలని ఆదేశించారు.విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై మరింత ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా శ్రద్ధ చూపాలని తెలిపారు. విద్యార్థుల హాజరుపై నిరంతర పర్యవేక్షణప్రతి విద్యార్థి ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్నట్లయితే సంబంధిత తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదించి, కారణాలను తెలుసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రతి పాఠశాలలో నెలకోసారి తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలని, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, అభ్యసన సామర్థ్యాలపై తల్లిదండ్రులకు వివరించి వారి సహకారం తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి చిన్నారి పట్ల మనం చూపించే శ్రద్ధ మన బోధనలోనూ, విద్యార్థుల అభ్యసనలోనూ స్పష్టంగా కనిపించాలి. ప్రతి విద్యార్థి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలి సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంపీడీవో శ్రీజ రెడ్డి, ఎం.పి.ఓ.షబ్బీర్ పాషా, ఏఈ పి.ఆర్. జగదీశ్,సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పాపన్నపేటలో డ్రైనేజీ పనులు ప్రారంభం

-పాపన్నపేటలో రూ. 7 లక్షలతో డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ పావని నరేందర్ గౌడ్



పాపన్నపేట,సెప్టెంబర్ 09:(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన పాపన్నపేటలో బుధవారం పెద్దహరిజన వాడ నుండి పాతూరు నాయికోటి శ్రీనివాస్ ఇంటి వరకు డ్రైనేజీ పనులు ప్రారంభించినట్లు పాపన్నపేట సర్పంచ్ లింగంపేట పావని నరేందర్ గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఈ జిఎస్ పథకం ద్వారా దాదాపు రూ.7లక్షలతో పనులను ప్రారంభించినట్లు ఆమె పేర్కొన్నారు. హరిజన వాడ నుండి పాతూరుకు డ్రైనేజీ లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని,దీనితో కాలనీ వాసులకు కొంత ఉపశమనం కలిగినట్లు అయిందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంపేట నరేందర్ గౌడ్,ఉప సర్పంచ్ ఎండీ.సద్దాం, మాజీ ఉప సర్పంచ్ ఎండీ. ఖలీం, నాయకులు దోసని సంగమేశ్వర,ముశెట్టి కిష్టయ్య,సుంకరి శివయ్య,బెస్త శ్రీశైలం,వార్డు సభ్యులు ఎండీ. చోటుమియా,గులాం దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారమే ఆరోగ్యానికి పునాది సర్పంచ్



ఓదెల సెప్టెంబర్ 09 తెలంగాణ పత్రిక

ఓదెల మండలం లోని రూప్‌నారాయణపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అఫ్రీన్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఒంగోలు రమ శ్రీనివాస్ ఆదరయ్యారు సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులు, తల్లులకు సమతుల్య ఆహారం, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాల ప్రాధాన్యత. కలిగి ఉండాలని ముఖ్యంగా పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం, గుడ్లు, పాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు తదితర ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా అందించాల్సిన అవసరాన్ని వివరించారు. పోషకాహార లోపాన్ని నివారించడం, పరిశుభ్రత పాటించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జీలుక స్వప్న సంతోష్, అంగన్‌వాడీ టీచర్ అనుష, ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు, చిన్నారులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉన్నత పాఠశాలల్లో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

-తెలంగాణ చైతన్యానికి కాళోజీ సేవలు చిరస్మరణీయం

-ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి

సెప్టెంబర్ 9 ( తెలంగాణ పత్రిక )





మణుగూరు: తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఉన్నత పాఠశాలల్లో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల యాస, భాష, సంస్కృతి, ఆత్మగౌరవానికి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తన రచనలు, కవితలు, పదునైన వ్యంగ్యాస్త్రాల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని రగిలించిన మహాకవి కాళోజీ అని కొనియాడారు. కాళోజీ జీవిత ప్రస్థానం సామాన్య ప్రజల సమస్యలతో ముడిపడి ఉందని, సామాజిక అన్యాయం, అణిచివేత, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన తన కలాన్ని ఒక ఆయుధంగా మలిచారని తెలిపారు. 'నా గొడవ' కేవలం కాళోజీ వ్యక్తిగత గొడవ కాదని, అది తెలంగాణ ప్రజల గొడవగా, వారి ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల భాషను, జీవన విధానాన్ని, కష్టాలను, ఆకాంక్షలను తన రచనల్లో ప్రతిబింబిస్తూ ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని, పోరాట స్ఫూర్తిని కాళోజీ పెంపొందించారని అన్నారు. ఆయన రచనలు నేటి తరానికి కూడా సామాజిక బాధ్యతను, ప్రజాస్వామ్య విలువలను, మానవతా దృక్పథాన్ని నేర్పుతున్నాయని వివరించారు. కాళోజీ నారాయణరావు స్వాతంత్ర్యోద్యమం, నిజాం వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ ప్రజా చైతన్య ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషించారని, అన్యాయాన్ని ప్రశ్నించడంలో ఎప్పుడూ వెనుకడుగు వేయలేదని తెలిపారు. ఆయన సాహిత్య సేవలకు లభించిన వివిధ పురస్కారాలు, పద్మవిభూషణ్ వంటి గౌరవాలు ఆయన సాహిత్య ప్రతిభకు, ప్రజాసేవకు నిదర్శనమని పేర్కొన్నారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ద్వారా తెలంగాణ యాస, భాష, సంస్కృతి పట్ల గౌరవాన్ని భావితరాల్లో పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కళ్యాణి అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుడు లింగంపల్లి దయానంద్ సమన్వయం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తానయ్య, రాజసింహ, లక్ష్మి, కళ్యాణ్, తహర్ పాషా, ఉపేంద్ర, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పరిస్థితుల్లోనీటి పొదుపుకుడ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులుతప్పనిసరి







-ఉద్యాన పంటలకు సూక్ష్మ సాగునీటి విధానాలతో అధిక ప్రయోజనాలు

పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 9 ( తెలంగాణ పత్రిక )

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండే అవకాశం ఉన్నందున, రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు డ్రిప్ మరియు స్ప్రింక్లర్ సూక్ష్మ సాగునీటి విధానాలను రైతులు విస్తృతంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. బుధవారం సుల్తానాబాద్ మండలంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ సాగునీటి వ్యవస్థలను జిల్లా ఉద్యానశాఖ అధికారి పరిశీలించారు. డ్రిప్ పరికరాల ఏర్పాటు తీరును యాదృచ్ఛికంగా తనిఖీ చేసి, రైతులతో నేరుగా మాట్లాడి, సూక్ష్మ సాగునీటి కంపెనీలు చేపడుతున్న పనుల్లో పారదర్శకత, నాణ్యత, రైతులకు అందుతున్న సబ్సిడీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ప్రతి రైతు బాధ్యత అని ఆయన తెలిపారు. సాగునీటి అవసరాన్ని తగ్గిస్తూ పంటలకు అవసరమైన నీటిని నేరుగా మొక్కల వేర్లకు అందించడంలో డ్రిప్ పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. స్ప్రింక్లర్ విధానం కూడా నీటి పొదుపుతో పాటు సమర్థవంతమైన సాగునీటి నిర్వహణకు దోహదపడుతుందని తెలిపారు. రైతులకు భారీగా సబ్సిడీఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు సూక్ష్మ సాగునీటి పద్ధతుల ఏర్పాటుకు ప్రభుత్వం గణనీయమైన సబ్సిడీ అందిస్తోందని జిల్లా ఉద్యానశాఖ అధికారి తెలిపారు.

**ఎస్సీ ఎస్టీరైతులకు -- 90% సబ్సిడీ**

బిసి వర్గానికి చెందిన చిన్న, సన్నకారు రైతులకు -- 80% సబ్సిడీసాధారణ వర్గానికి చెందిన పెద్ద రైతులకు -- 70% సబ్సిడీఅర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పొలాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.అనంతరం సుల్తానాబాద్ మండలంలోని కూరగాయల సాగు పొలాలను కూడా జిల్లా ఉద్యానశాఖ అధికారి పరిశీలించి, రైతులకు పంటల సాగు, నీటి యాజమాన్యం, పురుగు--తెగుళ్ల నివారణ తదితర అంశాలపై సాంకేతిక సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కేవీకే రామగిరి ఖిల్లా సీనియర్ శాస్త్రవేత్త శ్రీ వెంకట రమేష్, ఉద్యాన శాస్త్రవేత్త శ్రీ భాస్కర్ రావు, కీటక శాస్త్రవేత్త శ్రీ వెంకన్న, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త శ్రీ వినోద్, ఉద్యానశాఖ అధికారి శ్రీ ఎస్. మహేష్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# బడి పిల్లల సౌకర్యం కోసం స్వచ్ఛందంగా గడ్డి మందును కొట్టించిన పేరెంట్స్ కమిటీ

గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9





రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల టీజీఎస్ డబ్ల్యూ ఆర్ఈఐఎస్ స్కూల్ జూనియర్ కళాశాల గ్రౌండ్ పరిసర ప్రాంతంలో గడ్డి పెరగడంతో పిల్లలకు బట్టలు అరపెట్టుకొని విలు లేకుండ గ్రౌండ్ అంత గడ్డి ఉండడం తో పిల్లలు భయబ్రాంతులకు గురవుతున్నారని సాయంత్రం వేళలో గ్రౌండ్ లో ఆడుకోవాలంటే ఇబ్బందికర పరిస్థితి ఉన్నదని ఈ విషయాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం నూతనంగా ఎన్నికైన పేరెంట్స్ కమిటీ దృష్టికి తీసుకరాగా వెంటనే పిల్లల సౌకర్యం కోసం పేరెంట్స్ కమిటీ చైర్మన్ అంకం మానస వైస్ చైర్మన్ శనిగరపు నరేష్ వర్మ, కార్యవర్గం సభ్యులు జోగు జగన్ కార్యవర్గ సభ్యులు బుధవారం రోజున స్వచ్ఛందంగా గడ్డి మందును స్ప్రే చేయించారు అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే పరిష్కరిస్తామని,అవసరమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి మీకు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు అధ్యాపక బృందం అందరూ పిల్లలకు మంచి విద్యను అందించాలని ఇక్కడ చదువుకునే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయిలో నిలవాలని ఆ విధంగా అధ్యాపకులు కృషి చెయ్యాలని కోరుకున్నట్లు తెలిపారు పిల్లల తల్లిదండ్రులు కూడ పిల్లల సౌకర్యాలకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని పేరెంట్స్ కమిటీ కోరారు

# నీటికుంటలో మునిగి రైతు మృతి



జుక్కల్ అర్సీ/ సెప్టెంబర్ 9 (తెలంగాణ పత్రిక)

నిజాంసాగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సుంకే సాయిలు ప్రమాదవశాత్తు నీటికుంటలో మునిగి మృతి చెందాడు. ఎస్ ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం పొలానికి నీరు అందించేందుకు వెళ్లిన సాయిలు. గ్రామ పరిధిలోని బోయినోళ్ల జాలకుంట తూము వద్ద ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే నీటిలో నుంచి సాయిలును బయటకు తీశారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాట్లు తెలిపారు.

# గిరిజన బాలుర వసతి గృహంలో నీటి సమస్యకు తక్షణ పరిష్కారం

-విద్యార్థుల ర్యాలీ.. డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం
-వెంటనే స్పందించి బోరు మోటార్ మంజూరు చేసిన డిప్యూటీ కలెక్టర్



తెలంగాణ పత్రిక దమ్మపేట సెప్టెంబర్ 9

దమ్మపేట: స్థానిక గిరిజన బాలుర వసతి గృహంలో నెలకొన్న తీవ్ర నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ హాస్టల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ కలెక్టర్‌కు అందజేశారు. విద్యార్థులకు మద్దతుగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్, మండల కన్వీనర్ మురారి రఘు డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. హాస్టల్‌లో బోరు మోటార్ లేకపోవడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు గిరిజన బాలుర వసతి గృహంలో ఇప్పటివరకు బోరు మోటార్ సౌకర్యం లేకపోవడంతో వీధి కుళాయిలపై ఆధారపడి రోజువారీ అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. దీనికితోడు గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరు కూడా సరఫరా కాకపోవడంతో విద్యార్థులు తాగునీటితో పాటు కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

**సమస్య తీవ్రతను గుర్తించిన డిప్యూటీ కలెక్టర్**

విద్యార్థులు, సీఐటీయూ నాయకులు వివరించిన సమస్యలను డిప్యూటీ కలెక్టర్ సానుకూలంగా పరిశీలించారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ జేఈతో పాటు హాస్టల్ వార్డెన్‌ను పిలిపించి సమస్యపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే బోరు మోటార్ మంజూరు చేయాలని ఆదేశించారు. తమ సమస్యపై తక్షణమే స్పందించి బోరు మోటార్ మంజూరు చేసిన డిప్యూటీ కలెక్టర్‌కు హాస్టల్ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# కేసీఆర్‌ను కించపరిచే వ్యాఖ్యలు సరికాదు

-ఈర్లపల్లి శంకర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి: రవి గౌడ్

తెలంగాణ పత్రిక బొంరాస్ పేట్‌సెప్టెంబర్ (09)



బొంరాస్‌పేట్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు రవి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఇర్లపల్లి శంకర్ చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మాట్లాడే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా కించపరిచేలా లేదా అభ్యంతరకరంగా మాట్లాడటం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లో ఆగ్రహానికి దారితీసే అవకాశం ఉన్నందున నాయకులు సంయమనం పాటించాలని కోరారు. కేసీఆర్ చావును కోరే విధంగా వ్యాఖ్యలు చేసిన ఇర్లపల్లి శంకర్‌పై పార్టీ పరంగా వెంటనే చర్యలు తీసుకుని భర్తరఫ్ చేయాలని రవి గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు అవకాశం ఉన్నప్పటికీ భాష, వ్యాఖ్యల విషయంలో హద్దులు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు యాదగిరి, మహేందర్ రెడ్డి, అనంత్ గౌడ్, సూరి గౌడ్, సలాం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభతో విలసిల్లిన పొలాస సహస్ర లింగాల క్షేత్రం

-శివనామస్మరణతో పులకించిన భక్తజనం వేయి లింగాలకు అన్నాభిషేక మహోత్సవం

జగిత్యాల, సెప్టెంబర్ 9(తెలంగాణ పత్రిక ):





పరమశివుని కరుణాకటాక్షాలకు నిలయమైన పొలాస సహస్ర లింగాల దేవాలయం బుధవారం శివమయమైంది. వేలాది మంది భక్తుల కొలహలంతో జాతర వాతావరణం నెలకొన్నది. శ్రావణ మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అన్నపూజ మహోత్సవం భక్తి పారవశ్యంతో వేదమంత్ర ఘోషతో అలరించింది ఆలయ వ్యవస్థాపక చైర్మన్ నలమాస గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దివ్య కార్యక్రమంలో వేయి శివలింగాలు అన్నాభిషేకంతో దీప్యమానంగా వెలిగిపోయాయి. భక్తులు తమ స్వహస్తాలతో శివయ్యకు అన్నాన్ని సమర్పించి ఆత్మానందం పొందారు. "హరహర మహాదేవ శంభో శంకర" అనే నినాదాలతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది. జగిత్యాల జిల్లా నలుమూలల నుండే కాకుండా కరీంనగర్ నిర్మల్ మంచిర్యాల సిరిసిల్ల పెద్దపల్లి జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రాగ హైదరాబాద్ నుండి సైతం భక్తులు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పునీతులయ్యారు. ఈ పుణ్య కార్యక్రమం చూడడం పూర్వ జన్మ సుకృతమని మహిళా భక్తులు చెట్ల జానకి టీం సభ్యులు తదితరులు పేర్కొన్నారు. భజన బృందాల సంకీర్తనలు మంగళహారతి గీతాలతో క్షేత్రమంత జాతర శోభను సంతరించుకుంది. అనంతరం వేద పండితులు భక్తులకు గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు జరిపి హారతి ఆశీర్వచనం అందించారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు 300 కిలోల బియ్యంతో తయారు చేసిన పవిత్ర అన్నాన్ని పూజానంతరం రాయపట్నం వద్ద పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేయడం విశేషం, శివునికి అన్నం సమర్పించడం వల్ల అన్న దోషాలు తొలగి ఐశ్వర్యం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ మహోత్సవంలో జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం దంపతులు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్ దంపతులు పురానిపేట ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ కొత్త ప్రతాప్ జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎన్నం కిషన్ రెడ్డి-మంజుల దంపతులు ఆలయ ట్రస్టీ సభ్యులు శేఖర్ దంపతులు జగిత్యాల మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ఆడువాల జ్యోతి ఎడమల పద్మారెడ్డి చెట్ల జానకి బృందం బొందుకూరి శ్రీనివాస చారి తదితర ప్రముఖులు ట్రస్టీ సభ్యులు మహిళ సేవకురాళ్లు పాల్గొన్నారు.

# దళితులపై దొర అహంకారం చూపించారు

-కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లు పూర్తిగా దళిత వ్యతిరేకులు
-పసుపు నీళ్ల చల్లించి అవమానించారు....
-టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి ఆగ్రహం

నంగునూరు, సెప్టెంబర్ 9(తెలంగాణ పత్రిక);



కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లు దళిత వ్యతిరేక వైఖరిని మరోసారి బయట పెట్టుకున్నారని టీపీసీసీ కార్యదర్శి, సిద్దిపేట జిల్లా నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో దళితులకు జరిగిన అవమానాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు. అధికారం ఉందనే అహంకారంతో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా వ్యవహరించారని ఆరోపించారు.

**నేరెళ్ల ఘటనను మర్చిపోలేం**

నేరెళ్ల ఘటనలో దళిత సోదరులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలు అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించాయని యాదగిరి గుర్తుచేశారు. దళితులపై పోలీసుల చర్యల విషయంలో అప్పటి ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనేక ప్రశ్నలకు తావిచ్చిందన్నారు. దళితుల బాధను అర్థం చేసుకోవాల్సిన పాలకులే వారిపై కఠినంగా వ్యవహరించారని విమర్శించారు.

**సొంత పార్టీ నేతలకే అవమానాలు**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన దళిత మంత్రులు, ప్రజా ప్రతినిధులకు కూడా తగిన గౌరవం దక్కలేదని యాదగిరి ఆరోపించారు. తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి, కొప్పుల ఈశ్వర్, జోగు రామన్న వంటి నాయకులను వివిధ సందర్భాల్లో ప్రజావేదికలపై, మీడియా సమావేశాల్లో అవమానించారని విమర్శించారు. ఇది కేవలం వ్యక్తుల అవమానం కాదన్నారు. దళిత నాయకత్వాన్ని చిన్నచూపు చూసే మనస్తత్వానికి ఇది నిదర్శనమని ఆరోపించారు.

**స్పీకర్‌పై వ్యాఖ్యలు దురదృష్టకరం**

అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనను కూడా యాదగిరి ప్రస్తావించారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రత్యక్ష ప్రసారాలు జరుగుతున్నాయని తెలిసినప్పటికీ దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్యానికి ప్రతీక అని అన్నారు. అలాంటి పవిత్రమైన వేదికపై సభ్యుల మధ్య పరస్పర గౌరవం ఉండాలని పేర్కొన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే దళిత సమాజ ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని యాదగిరి వ్యాఖ్యానించారు.

**పసుపు నీళ్ల ఘటనపై ఆగ్రహం**

ఈ ఘటనపై దళిత సమాజం ఆవేదనతో నిరసన వ్యక్తం చేసిన కొద్దిసేపటికే పసుపు నీళ్లు చల్లిన ఘటన చోటుచేసుకుందని యాదగిరి పేర్కొన్నారు. ఈ చర్య దళిత సమాజాన్ని మరింత బాధించిందన్నారు. "పసుపు నీళ్లు చల్లడం ద్వారా దొర అహంకారం, అంటరానితనపు మనస్తత్వాన్ని బయట పెట్టుకున్నారు" అని ఆయన తీవ్రంగా ఆరోపించారు. దళితులను గౌరవించని రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. దళిత ఆత్మగౌరవమే కీలకం రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని యాదగిరి గుర్తుచేశారు. కులం, మతం, ప్రాంతం ఆధారంగా ఎవరినీ అవమానించకూడదన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించే రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

**ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు**

దళితులకు ఇచ్చిన హామీలు, గత ప్రభుత్వ నిర్ణయాలు, దళితులపై జరిగిన ఘటనలన్నింటినీ ప్రజలు పరిశీలిస్తున్నారని యాదగిరి అన్నారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి, అదే దళితులను అవమానించే రాజకీయాలకు కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ గత పాలనపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని దేవులపల్లి యాదగిరి స్పష్టం చేశారు.

# రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం




-18 గంటల నిరంతర విద్యుత్ ఇవ్వాలి....
-వంగ రాజేశ్వర్ రెడ్డి

నంగునూరు, సెప్టెంబర్ 9(తెలంగాణ పత్రిక):

రైతుల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. రైతుల కష్టాల్లో రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటానని స్పష్టం చేశారు. రైతులకు కనీసం 18 గంటల పాటు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అందుతున్న సుమారు 10 గంటల విద్యుత్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు సకాలంలో కురవక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. పంటలను కాపాడుకోవాలంటే అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ సమస్యపై రైతులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట చుట్టుపక్కల కాల్వలు ఉన్నప్పటికీ చెరువుల్లోకి సాగునీరు చేరకపోవడం దురదృష్టకరమన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటలను నీటితో నింపాలి. అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించాలి. రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్ అందించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల పంటలను కాపాడే చర్యలు చేపట్టాలని వంగ రాజేశ్వర్ రెడ్డి కోరారు. రైతుల గొంతుకగా ఎల్లవేళలా నిలుస్తానని ఆయన హామీ ఇచ్చారు.



# నర్సింగాపూర్‌లో 22 ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

-దాతల సహకారంతో ఏర్పాటు.. ప్రారంభించిన జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి

జగిత్యాల మండలం, తెలంగాణ పత్రిక,సెప్టెంబర్ 09.

ప్రజల భద్రత,నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు నర్సింగాపూర్ గ్రామంలో 22 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.గ్రామ సర్పంచ్ కుక్కునూరు వంశీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాలు, రహదారులను కవర్ చేసే విధంగా సీసీ కెమెరాలను అమర్చారు. సీసీ కెమెరాల ప్రారంభ కార్యక్రమానికి జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, జగిత్యాల రూరల్



సీఐ సుధాకర్, రూరల్ ఎస్సై ఉమాసాగర్ హాజరై కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగిన సమయంలో నిందితులను గుర్తించడంతో పాటు, కేసుల దర్యాప్తులో కీలక ఆధారాలను సేకరించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కలిసి చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, దాతలు, గ్రామ పెద్దలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలకు సర్పంచ్ కుక్కునూరు వంశీ కృతజ్ఞతలు తెలిపారు.

# రాజగోపాల్‌పేట యువకుడికి డాక్టరేట్

-ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పట్టా పొందిన రాచకొండ కిషోర్

నంగునూరు, సెప్టెంబర్ 9(తెలంగాణ పత్రిక):

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాల్‌పేట గ్రామానికి చెందిన రాచకొండ కిషోర్ డాక్టరేట్ సాధించారు. దీంతో గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆయన పరిశోధన చేశారు. సౌర విద్యుత్, పవర్ మేనేజ్‌మెంట్ అంశాలపై పరిశోధన పూర్తి చేశారు. సెప్టెంబర్ 8న ఉస్మానియా విశ్వవిద్యాలయ ంలోని ఠాగూర్ ఆడిటోరియంలో 85వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా రాచకొండ కిషోర్ పీహెచ్‌డీ పట్టాను




స్వీకరించారు. పేదరికం నుంచి వచ్చిన కిషోర్ ఉన్నత విద్యలో ప్రతిభ చాటడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి డాక్టరేట్ సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కిషోర్ విజయంతో రాజగోపాల్‌పేట గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, గ్రామస్థులు ఆయనను అభినందించారు.



ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, సమన్వయంతో విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.

(పాలకుర్తి/తొర్రూర్) తెలంగాణ పత్రిక ప్రతినిధి పున్నం సారయ్య

మహబూబాబాద్ జిల్లాలో వినాయక నిమజ్జన వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి, వినాయక నిమజ్జన వేడుకలపై రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జన ఘాట్ల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా రూట్ డైవర్షన్ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులను షిఫ్టుల వారీగా నియమించాలి. ఊరేగింపు మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సంబంధిత శాఖల




వారు సరిచేసి, ఎత్తు పెంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్‌తో పాటు ఘాట్ల వద్ద అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలగకుండా, క్రేన్లు సులభంగా నిలిచేందుకు మరియు విగ్రహాలు నీటిలో సరిగ్గా మునిగేందుకు నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు నిమజ్జనం జరిగే చెరువులు, జలాశయాలు లేదా కాలువల్లో తగినంత నీటి మట్టం ఉందో లేదో పర్యవేక్షించి మండల అధికారులను సమన్వయం చేసుకొని నివేదికలు అందజేయాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఘాట్ల వద్ద బలమైన బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను మోహరించాలన్నారు. అగ్నిమాపక శకటాలను (ఫైర్ ఇంజిన్లు) ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. మండప నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించా లన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయిన తరువాత ఘాట్ల వద్ద, ప్రధాన రహదారులపై మున్సిపల్ మరియు పంచాయతీ సిబ్బంది సహాయంతో మట్టి, వ్యర్థాలు, పూజా సామగ్రిని తొలగించి శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ. నాగావాణి, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఒ లు రాజేశ్వరీ, గణేష్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తాతామధు పై కఠిన చర్యలు తీసుకోవాలి

-జాతీయ మాలల ఐక్యవేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం

గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో జాతీయ మాలల ఐక్య వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు అనంతరం దోసల చంద్రశీ మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు వెంటనే తాతా మధు ను మండల స్పీకర్ సస్పెండ్ చేయవలసిందిగా దళిత స్పీకర్ పై అవమానకరమైన మాటలు తెలంగాణ రాష్ట్రంలో ఇది ఒక చీకటి రోజుగా భావిస్తున్నాం శాసనసభ స్పీకర్ పైన ఇలాంటి వివక్షత ఉంటే సామాన్యుల పరిస్థితి ఏంటి వెంటనే మండల చైర్మన్ కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా అలాగే బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు ని పార్టీ నుండి సస్పెండ్ చేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నాము దళితుల పట్ల మీ స్టాండ్ ను తెలియజేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ పార్టీని డిమాండ్ చేస్తూ తాత



మధు పై కఠిన చర్యలు తీసుకోని పక్షాన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు తావు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతూ తాతా మధు పై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను ఈ కార్యక్రమంలో మాదిగ అక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూడేల్లి ప్రవీణ్ కుమార్ మాలల ఐక్యవేదిక జిల్లా కోకన్వీనర్ మల్యాల రాజీవ్ర్ మండల అధ్యక్షులు లక్కం బాబు నాయకులు మద్దెల రాజనర్స్ నాయకులు శనిగారపు నరేష్ వర్మ దోసల రాజు టేకుమల్ల రాజు బరిగెల సురేష్ సుందరగిరి బాలరాజు దోసల రామచంద్రం మద్దెల శంకర్ దాసరి నారాయణ బండమీది దేవయ్య కాదరి సత్యం అనిల్ అశోక్ తదితరులు పాల్గొన్నారు

## మార్చాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తలసాని వెంకట చల్మ రెడ్డి



తెలంగాణ పత్రిక (కల్వకుర్తి ప్రతినిధి) సెప్టెంబర్ 09:

కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బెక్కెర బాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శేషి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తలసాని వెంకట చల్మ రెడ్డిని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చల్మ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి హరిదాసు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ నిజామోద్దీన్, తలసాని లక్ష్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటగిరి ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాష దినోత్సవ వేడుకలు

-ఎంఈఓ నాందేడ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో



కోటగిరి తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9.

కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాష దినోత్సవ వేడుకలను కాళోజి జయంతిని మండల విద్యాభివృద్ధి అధికారి నాందేళ్ళ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు ఉపన్యాసాలు ఉపాధ్యాయుల ఉపన్యాసాలు కవితలతో కార్యక్రమం రసవత్తరంగా కొనసాగింది. తెలుగు భాష గొప్పదనాన్ని తెలంగాణ మండలి కం ప్రధానోపాధ్యాయులు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున్ గణేష్ బృందం విద్యార్థులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దంతాలపల్లి మండలంలో బిజెపి మంచి నాయకున్ని కోల్పోయింది



పాలకుర్తి/తొర్రూర్) తెలంగాణ పత్రిక ప్రతినిధి పున్నం సారయ్య

బిజెపి నాయకుడు అల్లం సాయికుమార్ విగ్రహ ఆవిష్కరణలో మాట్లాడిన బిజెపి సీనియర్ నాయకులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు, అల్లం సాయికుమార్ కుటుంబ సభ్యులు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన జ్ఞాపకం కోసం పార్కు నిర్మించడం ఎంతో సంతోషకరమని అలాంటి మంచి నాయకున్ని గుర్తుంచుకోవడం కోసం కుటుంబ సభ్యులు చేసిన పనిని ఆయన కొని ఆడారు మంచికి మారుపేరు బిజెపికి చేసిన సేవలు చాలా గొప్పవాన్ని ఆయన కొనియాడారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, అల్లం చంద్రశేఖర్ వారి కుటుంబ సభ్యులు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ గరికపాటి మోహన్రావు మాజీ రాజ్యసభ సభ్యులు,మార్తినేని ధర్మారావు హనుమకొండ మాజీ ఎమ్మెల్యే,, వల్లభు వెంకటేశ్వర్లు మానుకోట జిల్లా అధ్యక్షులు, సీతారాం నాయక్, దాసరి మురళి తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**-విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి: నాగేల్లి రాజు**

**ఆత్మకూరు, సెప్టెంబర్ 09: (తెలంగాణ పత్రిక) :**



తెలంగాణలో ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ముఖ్యంగా బీఎస్సీ, ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి తీసుకువస్తున్నాయని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు నాగేల్లి రాజు కోరారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# గణేష్ మండలి సభ్యులకు ముఖ్య సమావేశం




**ముథోల్:09సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)**

మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల గణేష్ మండలి, ఉత్సవ కమిటీ సభ్యులకు ముఖ్య సమావేశాన్ని ఈనెల 11న ఉంటుందని ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం ముథోల్ లోని జీఎం గార్డెన్ లో నిర్వహించే సమావేశానికి అన్ని గ్రామాల యూత్ సభ్యులు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు. ప్రతి గణేష్ మండలి, ఉత్సవ కమిటీ సభ్యుల యొక్క అభిప్రాయాలు సలహా, సూచనలు ఇవ్వాలన్నారు.అందరి సహకారంతో నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు సహకరించాలని కోరారు.

# గణేష్ మండప నిర్వాహకులతో డీఎస్పీ నాగేంద్ర చారి సమావేశం



**ఇల్లంతకుంట సెప్టెంబర్ 9 తెలంగాణ పత్రిక**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ నాగేంద్ర చారి సూచించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో బుధవారం మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.రోడ్లపై ట్రాఫిక్ కు, అంబులెన్స్ లకు ఆటంకం కలగకుండా మండపాలు పెట్టాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, సౌండ్ సిస్టం కు పోలీస్ పర్మిషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు.భక్తి పాటలు మాత్రమే పెట్టాలని, రాత్రి పూట మండపం వద్ద నిర్వాహకులు ఉండాలని, తాగి అల్లరి చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.ఈ సమావేశంలో రూరల్ సీఐ నాగేశ్వరరావు, ఎస్సై ఉపేంద్ర చారి పాల్గొన్నారు.

# యూరియా కోసం గాలిపల్లి సొసైటీకి తాళం

**- కార్యాలయం ఎదుట రైతుల బైఠాయింపు**



**ఇల్లంతకుంట సెప్టెంబర్ 9 తెలంగాణ పత్రిక**

యూరియా కొరతతో విసిగిపోయిన రైతులు ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి తాళం వేసి నిరసనకు దిగారు.సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులకే ముందుగా యూరియా ఇవ్వాలని, జిల్లా యూనిట్ పేరుతో ఇతర ప్రాంతాలకు తరలించవద్దని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు.

# ప్రజల గొంతుకగా కాళోజీ - తెలంగాణ భాషకు జీవం పోసిన మహాకవి

**-వ్యాసకర్త లింగంపల్లి దయానంద్**

**కొత్తగూడెం సెప్టెంబర్ 09 (తెలంగాణ పత్రిక)**

"నా గొడవ"ను ప్రజల గొడవగా, "నా మాట"ను తెలంగాణ మట్టి మాటగా నిలిపిన మహాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని నేడు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా జరుపుకుంటున్నారు. ఇది కేవలం అధికారిక కార్యక్రమం మాత్రమే కాదు; తెలంగాణ నేల మాటకు, ప్రజల జీవన భాషకు, వారి ఆత్మగౌరవానికి నివాళి. 1914 సెప్టెంబర్ 9న జన్మించిన కాళోజీ చిన్ననాటి నుంచే నిజాం నిరంకుశ పాలన, ప్రజలపై అణచివేతను దగ్గరగా చూశారు. స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం, ప్రజాస్వామ్య ఉద్యమాలు ఆయన జీవితాన్ని మలిచాయి. కాళోజీ కేవలం కవి మాత్రమే కాదు – ప్రజాస్వరం, ఉద్యమకారుడు, మానవతావాది. అన్యాయాన్ని ప్రశ్నించి, అణగారిన వారి పక్షాన నిలబడిన మనస్సాక్షి. తెలంగాణ యాసకు తెచ్చిన గౌరవం ఒకప్పుడు తెలంగాణ యాసను వెనుకబాటుతనానికి గుర్తుగా చూసే రోజుల్లో, కాళోజీ తన రచనల ద్వారా "ప్రజలు మాట్లాడే భాషే ప్రజల భాష" అని చాటిచెప్పారు. ఆయన సాహిత్యం పుస్తకాల గదిలో కాదు, పల్లెబాటలో పుట్టింది. పాండిత్య ప్రదర్శన కంటే ప్రజల అనుభవాలకే ప్రాధాన్యం ఇచ్చారు. అందుకే ఆయన కవిత్వం సామాన్యుడికి సైతం అర్థమైంది. ఆయన మాటల్లో తెలంగాణ పల్లెల



వాసన, ప్రజల నవ్వు, నిట్టూర్పు, బాధ, ఆగ్రహం, ఆశ అన్నీ కనిపిస్తాయి. ఆయన భాషలో అలంకారాల కంటే ఆత్మీయత ఎక్కువ. తెలంగాణ మనిషి ఊపిరి వినిపించే పలుకుబడిని సాహిత్యంలో నిలబెట్టడమే కాక, దాన్ని మాట్లాడే ప్రజలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చారు. "మన మాట తక్కువ కాదు, మన జీవితం చిన్నది కాదు" అనే నమ్మకాన్ని బలపరిచారు.

**"నా గొడవ" – మనస్సాక్షి ప్రశ్న**

కాళోజీ ప్రసిద్ధ కృతి "నా గొడవ" వ్యక్తిగత గొడవ కాదు; అన్యాయం, దోపిడీ, అసమానత, మానవ గౌరవం కోసం సాగిన సామాజిక పోరాటం. ఆయన కవిత్వం ప్రశ్నిస్తుంది, గుచ్చుతుంది, నవ్విస్తుంది; చివరికి ఆలోచింపజేస్తుంది. ఆయన వ్యంగ్యం వినోదం కోసం కాదు – మార్పు కోసం. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, మానవ హక్కులు, సామాజిక న్యాయం ఆయన రచనల ప్రధానాంశాలు. రాజభవనాల కంటే పేదవాడి ఇల్లు, అధికారుల కంటే సామాన్యుడు ఆయన రచనల్లో నాయకులుగా కనిపిస్తారు. అందుకే "ప్రజాకవి" అనే పేరు ఆయనకు బిరుదు కాదు; నిర్వచనం. ఉత్సవం కాదు, బాధ్యత కాళోజీ జయంతిని పురస్కరించుకుని సభలు నిర్వహించడం, చిత్రపటాలకు పూలమాలలు వేయడం మాత్రమే నివాళి కాదని సాహిత్యవేత్తలు అంటున్నారు. తెలంగాణ మాటను గౌరవించడం, యాసను అవమానించకుండా కాపాడడం, స్థానిక సంస్కృతి–సంప్రదాయాలను పరిరక్షించడం, ప్రజల సమస్యలపై స్పందించడమే నిజమైన నివాళి. పిల్లలు తమ ఇంటి భాషలో ఆత్మవిశ్వాసంగా మాట్లాడే వాతావరణం ఏర్పడాలి. తెలంగాణ పదజాలం, జానపదం, సామెతలు, స్థానిక పలుకుబడులకు పాఠశాలలు, సాహిత్యం, మీడియాలో స్థానం పెరగాలి. కాళోజీ అంటే ఒక నిరంతర ప్రశ్న – అన్యాయం జరుగుతున్నప్పుడు మనం ఎక్కడున్నాం? ప్రజలు బాధపడుతున్నప్పుడు మన గొంతు ఎక్కడుంది? అని ప్రతి తరాన్ని ప్రశ్నించే అక్షరశక్తి ఆయన. "మన మాట మన గౌరవం... మన మనిషి మన బాధ్యత... అన్యాయాన్ని ప్రశ్నించడం మన ధర్మం" అనే కాళోజీ స్ఫూర్తి తెలంగాణ భాషలోనూ, ప్రజల గుండెల్లోనూ ఎప్పటికీ వెలుగుతూనే ఉంటుంది. వ్యాసకర్త: లింగంపల్లి దయానంద్, జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్

# కేసీఆర్‌కు ప్రాణహాని కుట్రపై పోలీసులకు ఫిర్యాదు

**-దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు**

**-కేసీఆర్ నివాసం వైపు పెద్ద సంఖ్యలో వాహనాల తరలింపుపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్**

**దమ్మపేట, సెప్టెంబరు 9 తెలంగాణ పత్రిక**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ప్రాణహాని కలిగించే కుట్ర జరిగిందంటూ బీఆర్ఎస్ నాయకులు దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు, అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచనలతో బుధవారం పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ బాలస్వామికి ఫిర్యాదు అందజేశారు. అసెంబ్లీ పరిణామాలపై ఆందోళన ఇటీవల శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలు, షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ చేసినట్లు పేర్కొంటున్న తీవ్ర వ్యాఖ్యలు ఆందోళన కలిగించాయని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రాజకీయపరమైన వాదనలను ఒక వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా ఉపయోగించడంతో పాటు, అనంతరం పెద్ద సంఖ్యలో వాహనాల్లో వ్యక్తులు కేసీఆర్





నివాసముంటున్న ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం వైపు వెళ్లిన ఘటనపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. వాస్తవాలను వెలుగులోకి తేవాలి కేసీఆర్‌ను చంపాలంటూ చేసినట్లు ప్రచారంలో ఉన్న వ్యాఖ్యలు, ఎర్రవల్లి వైపు వాహనాల తరలింపునకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలు, ప్రసార మాధ్యమాల్లో వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని పోలీసులను కోరినట్లు నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులపై వేధింపులు ఆపాలి గత కొంతకాలంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. పార్టీ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావులపై నిరాధార ఆరోపణలతో కేసులు పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా గతంలో కేసీఆర్‌పై చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తీవ్ర, అవమానకర వ్యాఖ్యలతో పాటు శాసనసభ వేదికగా చేసినట్లు పేర్కొంటున్న బెదిరింపు ధోరణి వ్యాఖ్యలను కూడా పోలీసులు పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. ఫిర్యాదులో పాల్గొన్న నాయకులు ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజుబోయిన యేసుబాబు, మండల సీనియర్ నాయకులు దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, సర్పంచ్ యట్ల రామదాసు, వార్డు సభ్యులు దారా రాము, ఉయ్యాల లక్ష్మీనారాయణ, మాజీ సహనామినేటెడ్ ఎంపీటీసీ బుడే, వెలుగోటి మహేష్, పాకనాటి శ్రీను, మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను, కొలికపోగు ధర్మ, కౌలూరి నాగయ్య, బండ్ల లక్ష్మయ్య, దండబత్తుల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టుక నీది - చావునీది బతుకంత దేశానిది ప్రజల్లో చైతన్యాన్ని నింపిన మహనీయుడు కాళోజి



**-జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ నివాళులు ఘనంగా కాళోజి జయంతి వేడుకలు**

**జగిత్యాల, సెప్టెంబర్ 9 (తెలంగాణ పత్రిక):**

ప్రజాకవి తెలంగాణ వైతాళికుడు కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ హాజరై కాళోజి నారాయణ రావు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజి నారాయణ రావు తన రచనల ద్వారా సామాన్య ప్రజల సమస్యలను సామాజిక రుగ్మతలను అన్యాయాలను ఎత్తి చూపుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి తన కలం గళం ద్వారా సామాజిక మార్పు కోసం కాళోజి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ యాస భాష సంస్కృతి సంప్రదాయాలపై కాళోజికి అపారమైన అభిమానం ఉండేదని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తన రచనలతో ప్రతిబింబిస్తూ తెలంగాణ ఉద్యమానికి తన రచనలు పోరాటాల ద్వారా స్ఫూర్తిని అందించారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య విలువలు సామాజిక న్యాయం మానవత విలువల పరిరక్షణ కోసం కాళోజి నారాయణ రావు జీవితాంతం పోరాడారని అన్నారు. ఆయన రచనలు నేటికీ సమాజాన్ని ఆలోచింపజేస్తూ ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. కాళోజి ఆశయాలను ఆయన చూపిన ప్రజాస్వామ్య స్ఫూర్తిని నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్. లత, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి. రాజగౌడ్, జిల్లా అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉప సర్పంచులకు చెక్ పవర్ తో సహా అన్ని అధికారలను తొలగించాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ కు జిల్లా సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో పిర్యాదు**

జగిత్యాల, సెప్టెంబర్ 9 (తెలంగాణ పత్రిక):

ఉప సర్పంచ్ లకు ప్రస్తుతం కల్పిస్తున్న చెక్ పవర్ తో సహా అన్ని అధికారాలను తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పంచాయతీ అధికారికి జగిత్యాల జిల్లా సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి ఆధ్వర్యంలో పిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రామ పంచాయతీల పరిపాలనలో ఉప సర్పంచ్ లకు చెక్ పవర్ (సంతకం అధికారం)తో పాటు పలు పరిపాలన అధికారాలను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ నిర్ణయం వల్ల క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీ పరిపాలనకు తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**మా అభ్యంతరాలు మరియు కారణాలు**



ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం సర్పంచ్ ప్రత్యక్షంగా ప్రజలచే ఎన్నుకోబడిన వ్యక్తి ఉప సర్పంచ్ వార్డు సభ్యులచే పరోక్షంగా ఎన్నుకోబడతారు. ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్ అధికారాలను పరోక్షంగా ఎన్నుకోబడిన వ్యక్తికి పంచడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అని అన్నారు.

**జంట అధికారంతో అభివృద్ధికి ఆటంకం**

ఇద్దరికీ చెక్ పవర్ ఉండటం వల్ల పరిపాలనలో జాప్యం జరుగుతుందని రాజకీయ విభేదాలు వ్యక్తిగత విభేదాల కారణంగా బిల్లులపై సంతకాలు చేయకపోవడం అభివృద్ధి పనులు నిలిచిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

**సర్పంచ్ పదవికి విలువ తగ్గడం**

సర్పంచ్ కు ఉన్న ఏకైక ప్రధాన అధికారం చెక్ పవర్ దానిని కూడ పంచడం వల్ల సర్పంచ్ పదవికి విలువ లేకుండ పోతుందని తెలిపారు. గత అనుభవాలు గతంలో కూడా ఇలాంటి ఉమ్మడి చెక్ పవర్ విధానం వల్ల అనేక గ్రామాల్లో గొడవలు జరిగి పంచాయతీ కార్యాలయాలకు తాళాలు వేసిన సందర్భాలు కూడ ఉన్నాయని ఆవేదన చెందారు. కావున ఈ విషయాన్ని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉప సర్పంచ్ లకు ఇప్పుడు కల్పిస్తున్న చెక్ పవర్ లాంటి అన్ని అదనపు అధికారాలను తొలగించి యథావిధిగా సర్పంచ్ లకే పూర్తి అధికారాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా సర్పంచ్ ల ఫోరం తరపున కోరుతున్నామని తెలిపారు.

# అంగన్వాడీల అరెస్టు దారుణం: సీఐటీయూ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

తెలంగాణ పత్రిక దమ్మపేట సెప్టెంబర్ 9

దమ్మపేట: అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం తలపెట్టిన హైదరాబాద్ ధర్నాకు వెళ్తున్న వారిని, అక్కడ నిరసన తెలుపుతున్న రాష్ట్ర నాయకత్వాన్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ... అంగన్వాడీ



ఉద్యోగులు తీవ్రమైన పనిభారంతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో కాలాన్ని వెళ్లదీస్తున్నప్పటికీ, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచకపోవడం సరైంది కాదన్నారు. అంగన్వాడీలకు నెలకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, పూర్వ ప్రాథమిక విద్యలో తీసుకొచ్చిన మార్పులను రద్దు చేయాలని, కేంద్రాల బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం శాంతియుతంగా ధర్నా చేపడితే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సూరమ్మ, జయ, వెంకటలక్ష్మి, సీతారామమ్మ, వజ్రమ్మ, జ్యోతి తదితర అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి సద్బుద్ధి కలగాలి రాజీవ్‌గాంధీ విగ్రహానికి జనసేన వినతిపత్రం

జగిత్యాల, సెప్టెంబర్ 9 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న అర్హులైన రైతుల భూముల సమస్యను పరిష్కరించి వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాలలో వినూత్న నిరసన చేపట్టారు. జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరు గ్యారెంటీల అమలును కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన జనసేన నాయకులు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసించారు. ప్రభుత్వానికి సద్బుద్ధి కలగాలని కోరుతూ రాజీవ్‌గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించడం ద్వారా తమ నిరసనను వినూత్న రీతిలో వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా నాయకుడు బెక్కం జనార్ధన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన



ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం రైతులకు రుణమాఫీ తదితర హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. అదే విధంగా 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న అర్హులైన రైతుల భూములను పరిశీలించి సమస్యలను పరిష్కరించి వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకులు కార్యకర్తలను అరెస్టులు కేసులతో అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజల హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? హామీలు అడిగితే కేసులు పెడతారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని స్పష్టం చేశారు. ఎన్నికల హామీల అమలు రైతుల భూహక్కులు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ప్రజా సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బెక్కం జనార్ధన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిర్లక్ష్య వైఖరిని విడనాడకపోతే జనసేన ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా జనసేన నాయకులు బత్తిని బాబు గౌడ్ గట్ల శ్రీకర్ జయపాల్ రెడ్డి మానేరు జగదీశ్ రెడ్డి జక్కని అఖిల్ బెక్కం ప్రవీణ్ అబ్బారి ఆనంద్ రాజు గౌడ్ మిరియాల వెంకటేష్ మైదారం మారుతి శ్రీనివాస్ శ్రీనివాస్ షబ్బీర్ జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లు వేగవంతం చేయాలి

**-పెండింగ్ టెండర్లు పూర్తిచేసి మౌలిక వసతులు కల్పించాలి**

**-భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ కన్వీనర్ ఆకుల సతీష్**

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 9:



వినాయక విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన నిమజ్జన ప్రదేశాల్లో మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్ అధికారులను కోరారు. నిమజ్జనానికి ముందే రోడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పూర్తిచేయాలని సూచించారు. ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి నిమజ్జన ప్రదేశాల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయని, పెండింగ్‌లో ఉన్న టెండర్లను వెంటనే పూర్తిచేసి పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. చేపట్టిన పనులు నాణ్యతతో, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెన్నెలగడ్డ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. కొంపల్లి సర్కిల్ పరిధిలోని ఊరకుంట, ధోమర్ కుంట చెరువుల వద్ద పనులు నెమ్మదిగా సాగుతున్నట్లు గుర్తించి వేగవంతం చేయాలని సూచించారు. సూరారం చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు భక్తులు, వాహనదారుల కోసం పార్కింగ్ సౌకర్యం కల్పించే అంశంపై వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. దుండిగల్ పెద్ద చెరువు వద్ద బ్యారికేడ్లు, రోడ్డు వెడల్పు అంశాలను పరిశీలించారు. బరంపేట పెద్ద చెరువు వద్ద నీటి కొరత నేపథ్యంలో నిమజ్జనానికి చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. బాచుపల్లి పెద్ద చెరువు వద్ద పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాటిని వెంటనే వేగవంతం చేయాలని కోరారు. శ్రీరాముల కుంట వద్ద వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బేబీ పాండ్‌లో నిమజ్జనం నిర్వహించేందుకు చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. పాపయ్య కుంట వద్ద మంచినీటి చెరువులో నిమజ్జనం చేయకుండా బేబీ పాండ్ ఏర్పాటు చేసేందుకు టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని, మరో ఐదు రోజుల్లో పనులు పూర్తిచేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఆకుల సతీష్ తెలిపారు.

**30 శాతం కూడా పూర్తికాని పనులు**

కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు మున్సిపల్ సర్కిళ్లలో నిమజ్జన మార్గాల్లో గుంతలు పూడ్చడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించడం, మార్గానికి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడం వంటి పనులు ఇంకా 30 శాతం కూడా పూర్తికాలేదని ఆకుల సతీష్ పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను అత్యవసర ప్రాతిపదికన పూర్తిచేయాలని కోరారు. పనుల పురోగతిపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి మరో రెండు రోజుల్లో జోనల్ కమిషనర్‌ను కలిసి అందజేస్తామని తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులకు పోలీసు, విద్యుత్, మున్సిపల్ శాఖల నుంచి ఎదురయ్యే సమస్యలను ఉత్సవ సమితి దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ఉత్సవ సమితి ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని ఆకుల సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజిరెడ్డి, కోకన్వీనర్ జైశంకర్ గౌడ్, డివిజన్ కన్వీనర్లు శంకర్ గౌడ్, పెద్దబత్తుల సతీష్ సాగర్, మాధవులు, నాగరాజు, పీసరి కృష్ణారెడ్డి, పొలబోయిన శ్రీనివాసులు, కోకన్వీనర్లు ఎల్ల స్వామి, శ్రీనివాస్ యాదవ్, కేసారం రాజు, మాధవరావు, అల్లాడి మహేష్, అశ్విన్, కోర్ కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, కంది శ్రీరాములు, శ్యామ్‌కుమార్ రెడ్డి, శరత్ గౌడ్, నాగరాజు, మనీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ (తెలుగు) భాషా దినోత్సవం




గంభీరావుపేట తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా బుధవారం రోజున తెలంగాణ భాషా దినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కాల్వ రాజయ్య, ముత్యాల నరేందర్ ప్రధానోపాధ్యాయులు సంటి గంగారాం అధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పద్యపఠన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు ఇట్టి కార్యక్రమాన్ని గురించి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో జ్ఞానాన్ని,ఉత్సాహాన్నీ పెంచుతాయని తెలియజేశారు.తెలంగాణ యాసభాషకోసం ఉద్యమం నడిపిన కాళోజీ అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు.ఇట్టి కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,తెలుగు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## భోసిలో తెలంగాణ భాషా దినోత్సవం



తానూర్:09సెప్టెంబర్(తెలంగాణ పత్రిక)

కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని భోసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ తెలంగాణ మాండలికం, మాతృభాష ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు బి.గణేష్ సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయులు మాట్లాడుతూ కాళోజీ సాహిత్య సేవలను, తెలంగాణ భాషాభివృద్ధికి ఆయన చేసిన కృషిని వివరించారు. అనంతరం విద్యార్థులు పద్యాలు, కథలు, సామెతలతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిర్మల్ నియోజకవర్గానికి సరస్వతి కాలువ నీరు విడుదల చేయాలని కూచాడి శ్రీహరి రావు విజ్ఞప్తి



నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09 (తెలంగాణ పత్రిక)

నిర్మల్ నియోజకవర్గ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్సారెస్పీ సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు కోరారు. ఈ విషయాన్ని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారితో ఫోన్‌లో మాట్లాడి నిర్మల్ నియోజకవర్గానికి సరస్వతి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించి, సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించి నీటి విడుదలకు చర్యలు చేపట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి కూచాడి శ్రీహరి రావు కృతజ్ఞత తెలిపారు ఈ కార్యక్రమంలో కూచాడి శ్రీహరి రావుతో పాటు లక్ష్మణ్‌చందా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ్రో నరేశ్ రెడ్డి మామడ మాజీ జడ్పీటీసి మొహమ్మద్ రఫీ మామడ మాజీ సర్పంచ్ బాపయ్య మరియు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బీఆర్ఎస్ కుమ్మక్కుతో అసెంబ్లీ సమావేశాలను తప్పుదోవ పట్టిస్తున్నారు

**-బీజేపీ సీనియర్ నాయకులు రావుల రామనాథ్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09 (తెలంగాణ పత్రిక)

తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రామనాథ్ తీవ్రంగా విమర్శించారు. ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం ప్రశ్నించకుండా, సమాధానం చెప్పాల్సిన అధికార పక్షం సమాధానం ఇవ్వకుండా అసెంబ్లీ సమావేశాలను వాయిదాలతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. 22- ఏ నిషేధిత భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం, ఉద్యోగ సమస్యలు, రైతులు, విద్యార్థులు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక కీలక సమస్యలపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు. బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చెప్పినట్లు గా అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు పొడిగించి ప్రజా సమస్యలకు ప్రభుత్వం స్పష్టమైన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలకు ఉచిత విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకపోతే బీజేపీ ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నిర్మల్ జిల్లా అధ్యక్షులు దొడ్డికింది నిరంజన్ రెడ్డి, ఇర్ల విజయ్, దీక్షిత్ రెడ్డి, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోతంగల్ గ్రామానికి గర్వకారణం

**-రాష్ట్ర స్థాయి వేదశాస్త్రి పురస్కారానికి డా. ప్రదీప్ జంగం స్వామీజీ ఎంపిక**
**-వేదశాస్త్ర సేవలకు దక్కిన ప్రతిష్ఠాత్మక గౌరవం**
**-నాందేడ్‌లో సెప్టెంబర్ 20న ఘన సన్మానం**

పోతంగల్ తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9.



వేదశాస్త్ర రంగంలో విశిష్ట సేవలు అందిస్తూ, విద్యార్థులకు వేద విద్యను బోధిస్తూ, వేద సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్న డా. ప్రదీప్ నాగలింగప్ప జంగం స్వామీజీకి రాష్ట్ర స్థాయి వేదశాస్త్రి పురస్కారం--2026కు ఎంపిక కావడం పోతంగల్ గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. పోతంగల్ గ్రామానికి చెందిన డా. ప్రదీప్ జంగం స్వామీజీ సాధించిన ఈ ప్రతిష్ఠాత్మక గౌరవం గ్రామ ప్రజలకు ఆనందం, గర్వాన్ని కలిగిస్తోంది. ఆయన వేద విద్యా సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దళితులపై వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి

**-బీఆర్ఎస్ నాయకుల తీరుపై పానుగంటి మహేష్ కుమార్ ఆగ్రహం**

మేడ్చల్ సెప్టెంబర్ 9 తెలంగాణ పత్రిక:



దళితులపై వివక్ష చూపే చర్యలను తీవ్రంగా ఖండించాలని ఏ బ్లాక్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్ అన్నారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నాయకులు తాత మధు, నరేందర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలకు నిరసనగా దళితులు డప్పు చప్పుళ్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. అయితే, నిరసనలో పాల్గొన్న దళితులు వెళ్లిన ప్రదేశాన్ని పసుపు నీటితో శుభ్రం చేశారంటూ వస్తున్న ఆరోపణలు తీవ్రంగా బాధించాయని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులపై వివక్ష, అహంకారపూరిత వైఖరిని విడనాడాలని ఆయన బీఆర్ఎస్ నాయకులను డిమాండ్ చేశారు. దళిత కాలనీల్లోకి వచ్చి వివక్ష చూపే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ఈ ఘటనపై దళిత సంఘాలు, ప్రజా సంఘాలు స్పందించి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దళిత సమాజాన్ని అవమానించే చర్యలకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో తగిన సమాధానం చెప్పాలని మహేష్ కుమార్ కోరారు.

# నిమజ్జన ఏర్పాట్లు సకాలంలో పూర్తిచేయాలి

**-నిమజ్జన ఘాట్లు, క్రేన్లు, లైటింగ్, బారికేడ్లు ఏర్పాటు చేయాలి**
**-పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను ప్రోత్సహించాలి: బిక్షపతి యాదవ్**

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 9:



వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో నిజాంపేట సర్కిల్ పరిధిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని బీజేపీ నాయకుడు బిక్షపతి యాదవ్ కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకులు నిజాంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. శ్రీరాములకుంట పార్క్, పాపయ్య కుంట, పెద్ద చెరువు తదితర ప్రాంతాల్లో భక్తులు సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు నిమజ్జన ఘాట్లు, క్రేన్లు, లైటింగ్, బారికేడ్లు, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తిచేయాలని కోరారు. నిమజ్జనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కారణంగా చెరువులు, కుంటలు కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత న్యాయస్థానాల మార్గదర్శకాలకు అనుగుణంగా తాత్కాలిక నిమజ్జన కొలనులు, బేబీ పాండ్లు, ఎర్త్ పిట్స్ వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను నిజాంపేట సర్కిల్‌లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. నిమజ్జన ఏర్పాట్ల కోసం సుమారు రూ.25 లక్షల నిధులు మంజూరైనప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయని బిక్షపతి యాదవ్ ఆరోపించారు. ఉత్సవాలు సమీపిస్తున్నందున పనులు ఆలస్యం అయితే భక్తులు, మండపాల నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. వినాయక చవితి అనంతరం తొలి ఆదివారానికే అధిక సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కోరారు.

**మట్టి గణపతులను ప్రోత్సహించాలి**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎకో ఫ్రెండ్లీ, మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని బిక్షపతి యాదవ్ కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని నియంత్రించేందుకు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని సూచించారు. వినాయక మండపాలకు అనుమతులు, నిమజ్జన సమయంలో భద్రతా చర్యల విషయంలో పోలీసు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజించిన గణనాథుడిని నిమజ్జనం చేసే సమయంలో భక్తులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. మురుగు నీటిలో నిమజ్జనం చేయడం, విగ్రహాలను కాలితో తన్నడం వంటి చర్యలకు పాల్పడకుండా మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండపాల వద్ద అసభ్యకరమైన లేదా అనుచితమైన కార్యక్రమాలు నిర్వహించకుండా సంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. సనాతన ధర్మం, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. నిజాంపేట సర్కిల్ పరిధిలోని భక్తులు, వినాయక మండపాల నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జన ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రసాద్ రాజు, సుమన్ రావు, శ్రీధర్ రెడ్డి, సచిన్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు

**-తలారి అవినాష్ కుమార్**
**-సర్పంచ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శిలి**

టేక్మాల్ తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 09




బీజేపీ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అవమానించింది.. ఇప్పుడు BRS దళితులను, కాంగ్రెస్ కార్యకర్తలను అవమానిస్తోంది! బీజేపీ, దీ=ూ పార్టీలకు దళితులంటే ఎందుకింత చిన్నచూపు? అని అన్నారు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గారిని బీజేపీ అవమానించిన ఘటనపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ, ఇప్పుడు తెలంగాణలో దీ=ూ పార్టీపై కూడా దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించేలా వ్యవహరించిందనే తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. దళితులు, కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనకు వెళ్లిన అనంతరం ఖజ= ఫామ్‌హౌస్ పరిసరాలను పసుపు నీళ్లతో శుద్ధి చేశారనే వార్తలు అత్యంత బాధాకరంగా ఉన్నాయి. ఆయన తెలిపారు నిరసనకు వచ్చిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా సరే --- వారు ఈ దేశ పౌరులు. వారిని కులం పేరుతో అవమానించడం, వారు వచ్చిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం వంటి చర్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదు. అన్నారు దళితులను అవమానించే హక్కు ఎవరికీ లేదు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదు.

**బీజేపీ అయినా... BRS అయినా...**

దళితుల విషయంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారు. అని మండిపడ్డారు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం కల్పించింది. కుల వివక్షకు, అవమానానికి, అంటరానితనపు ఆలోచనలకు తెలంగాణలో ఇక స్థానం ఉండకూడదు. అని అన్నారు KCR ఈ ఘటనపై వెంటనే స్పందించి ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి. ఇది కేవలం కాంగ్రెస్ కార్యకర్తల సమస్య కాదు... ఇది ప్రతి దళితుడి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం! అని తెలిపారు దళితుల ఆత్మగౌరవం కోసం చివరి వరకు పోరాడుతాం. అవమానించే రాజకీయాలకు తెలంగాణ ప్రజలు చరమగీతం పాడాలి అని ఆయన అన్నారు

## ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగి

**-జలాశయాలు కాలుష్యానికి గురికాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి**
**-పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**
**-2,000 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ**
**-మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్ ను విడుదల చేసిన జిల్లా కలెక్టర్**
**-కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి,ప్రతినిధి సెప్టెంబర్9 ( తెలంగాణ పత్రిక )



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ ) ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత విగ్రహాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరుల పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

**2,000 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ**

పర్యావరణహిత వినాయక చవితిని ప్రోత్సహించేందుకు 2,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని సూచించారు.మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, జలాశయాలు కాలుష్యానికి గురికాకుండా నిమజ్జన కార్యక్రమాలను పర్యావరణహితంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ సైంటిస్ట్ ఈ. కనకజ్యోతి, ఏవో పెద్దపల్లి బి. ప్రకాష్, సూపరింటెండెంట్ కోటేశ్వర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణి ,తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్మనీ టెక్నాలజీ తో స్వచ్ఛమైన త్రాగునీరు

**-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి..**

తెలంగాణ పత్రిక (కల్వకుర్తి) సెప్టెంబర్ 09




వెల్దండ మండలంలోని సెలోని బావి తండా గ్రామంలో నిర్వహించి త్రాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచి ప్రజలకు అందుబాటులో ఉంచారు.సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చిన జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో గ్రామాల్లోని తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరుస్తూ, ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రతను నెలకొల్ప డం ద్వారా తాగునీటి నాణ్యతను మెరుగుపరిచే చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా తాండా ప్రజలు సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, సీలోని బావి తండా గ్రామ సర్పంచ్ లక్ష్మి పత్తి గ్రామ డిప్యూటీ సర్పంచ్ ప్రియాంక ,మరియు ఐక్యత ఫౌండేషన్ రమేష్ వార్డు సభ్యులు శ్రీను ,గ్రామ నాయకులు హన్మంతు, సీత్య, లోక్య, రాజశేకర్, అరవింద్, మల్లేష్, రమేష్, బింసింగ్ యువకులు, గ్రామస్తులు ఉన్నారు.

# పర్యాటక అభివృద్ధికి మూడేళ్ల కార్యాచరణ రూపొందించాలి



-ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలి
-జ్ఞాన భారతం మిషన్‌లో భాగంగా ప్రాచీన గ్రంథాలను గుర్తించి డిజిటలైజ్ చేయాలి
-ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలి
-పీపీపీ విధానంలో పర్యాటక ప్రాజెక్టులకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలి
-పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్

పెద్దపల్లి,ప్రతినిధి సెప్టెంబర్9 ( తెలంగాణ పత్రిక )

ప్రతి జిల్లాలో ఉన్న ప్రత్యేక పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి, పర్యాటక రంగ అభివృద్ధికి మూడేళ్ల సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, జ్ఞాన భారతం మిషన్ అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ మాట్లాడుతూప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించాలని తెలిపారు. ప్రతి జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక బలాన్ని గుర్తించి, దానికి అనుగుణంగా జిల్లా పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్‌ను అభివృద్ధి చేయాలని



సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా 142 వీకెండ్ గేట్‌వే పర్యాటక ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, ప్రచార కార్యక్రమాలను సమగ్రంగా రూపొందించాలని తెలిపారు. ప్రతి జిల్లాకు మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, అందులో ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలు, అభివృద్ధి చేయాల్సిన ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలు, పెట్టుబడి అవకాశాలు, సందర్శకుల సౌకర్యాలు, ప్రచార కార్యక్రమాలను స్పష్టమైన కాలపరిమితులతో పొందుపరచాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు.జ్ఞాన భారతం మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మిషన్‌లో భాగంగా చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు, ఇతర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి సంరక్షించాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి, అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టులపై సమగ్ర సర్వే చేపట్టాలని తెలిపారు.ప్రాచీన గ్రంథాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లా తమ పరిధిలో అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టుల వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. తెలుగు పండితులు, ఉర్దూ పండితులు, ఇతర భాషల నిపుణుల వద్ద ఉన్న ప్రాచీన గ్రంథాల వివరాలను సేకరించి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జ్ఞాన భారతం మిషన్ అమలుకు జిల్లా అదనపు కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని తెలిపారు. పీపీపీ ఆధారిత పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏ. వాణి ప్రసాద్ సూచించారు. ప్రతి జిల్లాలో పీపీపీ విధానంలో చేపట్టేందుకు అనువైన పర్యాటక ప్రాజెక్టులను గుర్తించాలని, పర్యాటక ప్రాజెక్టులకు అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలని తెలిపారు. ప్రాజెక్టు ప్రతిపాదనలు, సాధ్యాసాధ్యాల



నివేదికలు, ఆర్ఎఫ్‌పీలు, ఈఓఐలు సిద్ధం చేసి అవసరమైన అనుమతులు పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రైవేట్ పెట్టుబడిదారులను గుర్తించి, వారితో సమావేశాలు నిర్వహిస్తూ పెట్టుబడులను ఆకర్షించాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని పర్యాటక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు. సీఎస్ఆర్ నిధుల సమీకరణ, వివిధ ప్రభుత్వ పథకాల అనుసంధానం ద్వారా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన వనరులను సమీకరించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సూచించారు. గుర్తించిన ముఖ్యమైన, అభివృద్ధి చెందుతున్న పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత కోసం సీసీ కెమెరాలు, వాచ్ అండ్ వార్డ్ సిబ్బంది, ఆపరేషన్, నిర్వహణ సిబ్బంది, సైన్‌బోర్డులు, సమాచార కియోస్కులు, శిక్షణ పొందిన స్థానిక గైడ్లు, టికెటింగ్ సౌకర్యం, ఫుడ్ కోర్టులు, దివ్యాంగులకు అనుకూలమైన మార్గాలు, రహదారులు వంటి సౌకర్యాలను ప్రాధాన్యతా క్రమంలో కల్పించాలని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల్లో 16 వారసత్వ ప్రదేశాలను గుర్తించి వాటి అభివృద్ధికి రూ. 8.45 కోట్లతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా వారసత్వ ప్రదేశాలను పర్యాటక ఆకర్షణలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏ. వాణి ప్రసాద్ తెలిపారు. ప్రతి జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక అనుభవాలు, ఉత్పత్తులను అభివృద్ధి చేసి, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను ఫ్లాగ్‌షిప్ డెస్టినేషన్లుగా గుర్తించి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. జిల్లా బ్రాండింగ్‌తో పాటు ఫిల్మ్ టూరిజం, ప్రపంచ పర్యాటక దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రచారం కల్పించాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డి.ఈ.ఓ. శారద , సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలి

-మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ
-కామారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ విక్టర్



కామారెడ్డి, సెప్టెంబర్ 9,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వై. గిరి సూచించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా అధికారుల సమన్వయంతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాల వినియోగం వల్ల నీటి వనరులు, పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉందని తెలిపారు. పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పూజా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రజలకు సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని అధికారులు కోరారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నరసయ్య, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి కె. రవిదాస్, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ బి. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ నిధి రికవరీని 95 శాతానికి, రుణాల పంపిణీని 100 శాతానికి చేరేలా చర్యలు చేపట్టాలి

-సెప్టెంబర్ నెలాఖరులోగా రికవరీని 90 శాతానికి పెంచాలి
-మన స్త్రీ నిది యాప్ వినియోగం తప్పనిసరి
-జీరో రికవరీ సంఘాల సంఖ్యను సున్నాకు తీసుకురావాలి
-సుస్థిర జీవనోపాధుల ఏర్పాటుకు స్త్రీ నిధిని సమర్థవంతంగా వినియోగించాలి
-స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీచేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ప్రతినిధి సెప్టెంబర్ 09 ( తెలంగాణ పత్రిక )




స్త్రీ నిధి రుణాల రికవరీని 95 శాతానికి, అర్హులైన వారికి రుణాల పంపిణీని 100 శాతానికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ఆదేశించారు.బుధవారంజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షఅధ్యక్షతన నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశంలో రికవరీ, రుణాల పంపిణీ, డిజిటల్ సేవల వినియోగం, సుస్థిర జీవనోపాధులు, ఆర్థిక క్రమశిక్షణ తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,ప్రస్తుతం జిల్లాలో 74 శాతంగా ఉన్న స్త్రీ నిధి రికవరీని సెప్టెంబర్ నెలాఖరులోగా గణనీయంగా పెంచి కనీసం 90 శాతానికి చేర్చాలని ఆదేశించారు. స్త్రీ నిధి క్రెడిట్ లక్ష్యాన్ని కూడా సెప్టెంబర్ నెలాఖరులోగా కనీసం 70 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అర్హత కలిగిన స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీ 100 శాతం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీవనోపాధి రుణాల మంజూరును మరింత పెంచాలని, మహిళలు సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకునేలా రుణాలను సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు.

**మన స్త్రీ నిధి యాప్ వినియోగం తప్పనిసరి**

స్త్రీ నిధి లావాదేవీల్లో పారదర్శకత, వేగవంతమైన అడ్జస్ట్‌మెంట్, సమగ్ర సమాచార నిర్వహణ కోసం అన్ని స్థాయిల్లో మన స్త్రీ నిధి యాప్ వినియోగాన్ని తప్పనిసరి చేయాలని ఆదేశించారు. రికవరీ, నగదు బదిలీ ప్రక్రియలు 100 శాతం డిజిటల్ విధానంలో జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ వివరాలు తదితర సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా పారదర్శకతను పెంచాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో యాప్ వినియోగంపై సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు, సాంకేతిక సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

**అవకతవకలకు పాల్పడే వీ ఓ ఏ లపై కఠిన చర్యలు**

స్త్రీ నిధి కార్యకలాపాల్లో అవకతవకలకు పాల్పడే వీ ఓ ఏ లపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.స్త్రీ నిధి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని సంఘాలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని, అవసరమైన సందర్భాల్లో రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**జీరో రికవరీ సంఘాలపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో జీరో రికవరీ ఉన్న స్వయం సహాయక సంఘాల సంఖ్యను సున్నాకు తీసుకురావాలని ఆదేశించారు. రికవరీలో వెనుకబడిన సంఘాలను గుర్తించి, వాటికి సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.రికవరీ ప్రక్రియలో సంఘాల సభ్యులకు రుణ చెల్లింపుల ప్రాధాన్యత, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించాలని అన్నారు. రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా సంఘాల క్రెడిట్ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.

**క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి సహకారం అందించాలి**

రికవరీతో పాటు ఇతర విధుల నిర్వహణలో స్త్రీ నిధి, మెప్మా, సెర్ప్ సిబ్బందికి అన్ని స్థాయిల్లో పూర్తి సహకారం అందించాలని సూచించారు. విధుల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని, రికవరీ లక్ష్యాల సాధనకు శాఖల మధ్య సమన్వయం మరింత పెంచాలని ఆదేశించారు.తక్కువ పనితీరు ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టిజూలపల్లి, ఎలిగేడు, పాలకుర్తి, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్ మండలాల్లో స్త్రీ నిధి రికవరీ పనితీరును మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.తక్కువ పనితీరు కనబరుస్తున్న క్లస్టర్లను గుర్తించి, వాటి వారీగా రికవరీ లక్ష్యాలను నిర్దేశించుకుని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రికవరీలో వెనుకబడిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని తెలిపారు.

**సుస్థిర జీవనోపాధుల ఏర్పాటుకు స్త్రీ నిధిని వినియోగించాలి**

స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు. మహిళలకు సుస్థిర జీవనోపాధులు కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు స్త్రీ నిధి సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలకు అవసరమైన రుణ సదుపాయాలను స్త్రీ నిధి ద్వారా అనుసంధానం చేయాలని, అర్హులైన మహిళా సంఘాలకు రుణాలు అందేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. స్త్రీ నిధి రుణాల సద్వినియోగం, సకాలంలో రుణ చెల్లింపులు, ఆర్థిక క్రమశిక్షణపై సంఘాల సభ్యులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. సెప్టెంబర్ నెలాఖరు లక్ష్యాలను ప్రతి స్థాయిలో కచ్చితంగా సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ కాళిందిని, సెర్ప్, మెప్మా, స్త్రీ నిధి అధికారులు, సిబ్బంది, జిల్లా సమాఖ్య ఓబీలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నినాదం



## మర్కల్ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు



కామారెడ్డి, సెప్టెంబర్ 9 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ మర్కల్ గ్రామం నందు ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి మర్కల్ నందు కాలోజీ నారాయణరావు 112 జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగు విభాగపు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి శోభారాణి గారు అధ్యక్షోపన్యాసం చేస్తూ కాళోజి నిరాడంబర జీవితం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం అన్నారు. విద్యార్థులు జంకు లేకుండా ఉత్సాహంగా రచనలు చేయాలని వాటిని మన కళాశాల మ్యాగజన్లో ప్రచురించే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం తెలుగు శాఖ అధ్యక్షులు రంగు ఉదయిని మాట్లాడుతూ కాళోజీ జీవితాన్ని వారి వ్యక్తిత్వాన్ని విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్ కృష్ణవేణి కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కే వనజ లతోపాటుగా అధ్యాపక బృందం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మహారాష్ట్ర డీజేల వల్ల ఉపాధి కోల్పోతున్నాం

-జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందించిన స్థానిక డీజే నిర్వాహకులు

-స్థానిక డీజే నిర్వాహకుల సమస్యలను సానుకూలంగా విన్న జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 09 (తెలంగాణ పత్రిక)



నిర్మల్ జిల్లాకు చెందిన 100 మందికి పైగా డీజే నిర్వాహకులు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలను కలిసి తమ సమస్యలను వివరించారు. మహారాష్ట్రకు చెందిన డీజే లు నిర్మల్ జిల్లాకు వచ్చి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల స్థానిక డీజే నిర్వాహకులకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని వారు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే అధిక శబ్దంతో డీజే లు నిర్వహించడం వల్ల సౌండ్ పొల్యూషన్ పెరిగి ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. వారి సమస్యలను జిల్లా ఎస్పీ సాను కూలంగా విని, స్థానిక డీజే నిర్వాహకులకు భరోసా కల్పించారు. మహారాష్ట్రలో డీజే ల వినియోగంపై ఆంక్షలు ఉండటంతో అక్కడి నుంచి కొంతమంది నిర్వాహకులు ఇతర ప్రాంతాలకు వస్తున్న పరిస్థితి ఉందని, నిర్మల్ జిల్లాకు మహారాష్ట్ర నుంచి డీజే లు రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధిక డెసిబెల్ స్థాయిలో శబ్దం చేయడం వల్ల ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నందున, పరిమిత శబ్ద స్థాయిలోనే డీజే లను నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు సహకరించాలని జిల్లా ఎస్పీ జి జానకి షర్మిల, సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, నిబంధనలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు డీజే నిర్వాహకులు సహకరించాలని జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల,కోరారు.

## వినాయక మండపాల లడ్డు ప్రసాదం తయారీ పూజ కార్యక్రమం నిర్వహించిన బీజేపీ నాయకులు

కామారెడ్డి ,సెప్టెంబర్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



ప్రతి సంవత్సరం లాగానే కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని వినాయక మండ పాలకు అందజేసే లడ్డు ప్రసాదంతయారీ పూజా కార్యక్రమం నేడు పట్టణంలోని 25 వ వార్డులో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గత 9సంవత్సరాలుగా ఏళ్లుగా కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో వినాయక చవితి సందర్భంగా వినాయకుడిని ప్రతిష్టించే వినాయక మండపాల కు కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి క్రమం తప్పకుండా ఇచ్చే లడ్డు ప్రసాదం ఈ సంవత్సరం కూడా ఇవ్వడం జరుగుతుందని యువకులు, పెద్దలు, పిల్లలు అందరూ తప్పక భక్తి భావం తో వినాయకుణ్ణి కొలిచి ప్రశాంతంగా నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకోవాలని సూచించారు. వినాయక మండపాలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న స్థానిక బీజేపీ నాయకులకు సంప్రదిస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తామని అన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





తెలంగాణపర్యాటక ప్రాంతాల అభివృద్ధికి శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జిల్లాల్లో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ సూచించారు. బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీ, పర్యాటక, ఇతర శాఖల అధికారులతో ప్రపంచ పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఆకర్షణీయమైన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొంది ంచడంతో పాటు, పర్యాటక ప్రాంతాల ప్రచారం, అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి ఆసక్తి ఉన్న యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. యువ టూరిజం క్లబ్‌ల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమాలను దినోత్సవ వేడుకల్లో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 142 పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ఫిల్మ్ టూరిజం ద్వారా పర్యాటక ప్రాంతాలను మరింత ప్రోత్సహించాలని సూచించారు. జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాల్లో అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్ చేసేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. దేవాలయాలు, మఠాలు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తుల వద్ద ఉన్న మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి సమగ్ర జాబితా రూపొందించాలని సూచించారు. జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, వాటికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా కామారెడ్డి జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని వాణి ప్రసాద్ సూచించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రజలకు చేరువ చేసేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. వై. గిరి, క్రీడా శాఖ అధికారి రంగ వెంకటేశ్వర్లు. సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై జిల్లా స్థాయి సమీక్ష

-ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

-కామారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకటి

కామారెడ్డి సెప్టెంబర్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)






కామారెడ్డిజిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత ప్రమాణాల మేరకు సాధించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకటి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బందితో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, మాతా శిశు ఆరోగ్యం, టీకాలు, క్షయ వ్యాధి నిర్మూలన, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, వ్యాధి నిర్ధారణ, స్క్రీనింగ్, చికిత్స, ఫాలోఅప్ తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమాల పురోగతిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించి, వెనుకబడిన సూచికలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. హైపర్‌టెన్షన్, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధులపై విస్తృతంగా స్క్రీనింగ్ నిర్వహించి, గుర్తించిన వారికి నిరంతర చికిత్స, ఫాలోఅప్ అందేలా చూడాలని ఆదేశించారు. క్షయ వ్యాధి అనుమానితులను త్వరగా గుర్తించి పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో సకాలంలో, ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, నివేదికలు వాస్తవ క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు. వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. "ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు జిల్లాలోని ఆరోగ్య సూచికలపై ప్రభావం చూపుతుంది. ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించడమే మన ప్రధాన లక్ష్యం. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలి" అని డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకటి పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజు, కార్యక్రమాల అధికారులు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బంది, ఇతర జిల్లా, క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన నిలిచి సామాజిక న్యాయం కోసం కాళోజి చేసిన కృషి చిరస్మరణీయం

-కామారెడ్డి జిల్లాఅదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, సెప్టెంబర్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



ప్రజాకవి కాళోజి నారాయణరావు సాహిత్యం ప్రజల జీవన విధానానికి, ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టిందని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. కాళోజి ఆలోచనలు, రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ విక్టర్ కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కాళోజి నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలకు బలమైన స్వరం అందించారని అన్నారు. తెలంగాణ సమాజంలో సామాజిక చైతన్యం, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. ప్రజల పక్షాన నిలిచి సామాజిక న్యాయం కోసం కాళోజి చేసిన పోరాటం, ఆయన సాహిత్య సేవలు చిరస్మరణీయ మని పేర్కొన్నారు. కాళోజి రచనల్లో సామాన్య ప్రజల జీవితం, వారి సమస్యలు, ఆకాంక్షలు ప్రతిబింబించా యని అదనపు కలెక్టర్ తెలిపారు. సమాజంలో నెలకొన్న అసమానతలపై తన రచనల ద్వారా ప్రశ్నిస్తూ, ప్రజల్లో చైతన్యం కలిగించిన మహనీయుడిగా కాళోజి నారాయణరావు నిలిచారని అన్నారు. ఆయన సాహిత్య స్ఫూర్తిని యువత ముందు కు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అధి కారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు మాట్లాడు తూ, కాళోజి నారాయణరావు ప్రజల కోసం నిరంత రం గొంతెత్తిన ప్రజాకవిగా తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ పాండు, డీఎంహెచ్ఓ వెంకటేష్, ఆర్డీఓ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నర్సయ్య, అసిస్టెంట్ బీసీ అభివృద్ధి అధికారి చక్రధర్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు సాపా శివరాములు, కొంగర వెంకటి, నాగభూషణం, ఎంబీసీ నాయకులు శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొని కాళోజి నారాయణరావుకు ఘనంగా నివాళు లర్పించారు.

# మాచారెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు 120 చెస్ బోర్డుల పంపిణీ

-ఎంఈఓ దేవేందర్ రావు

కామారెడ్డి సెప్టెంబర్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



చెస్ నెట్‌వర్క్ అసోసియేషన్ (కాకతీయ చెస్ బాక్స్) సౌజన్యంతో, చెస్ నెట్‌వర్క్ ఫౌండర్ సుధీర్ కోదాటి సహకారంతో మాచారెడ్డి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు మరియు గురుకుల పాఠశాలలకు 120 చెస్ బోర్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి మాచారెడ్డి మండల విద్యాధికారి దేవేందర్ రావు మరియు తెలంగాణ విశ్వవిద్యాలయ సౌత్ క్యాంపస్ అధ్యాపకుడు డాక్టర్ ఎస్. నారాయణ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ దేవేందర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు చెస్ నెట్‌వర్క్ అందిస్తున్న సేవలను అభినందించారు. చెస్ ఆట ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఓపిక, ఏకాగ్రత, తార్కిక ఆలోచనా శక్తి పెంపొందుతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని కోరారు. అనంతరం డాక్టర్ ఎస్. నారాయణ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. సంపూర్ణ విద్య సాధించాలంటే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అన్నారు. చెస్ ఆట ద్వారా జీవితంలోని ఒడిదుడుకులను ఎదుర్కొనే నైపుణ్యం, సమస్యలను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. చలో దోస్త్ -- చెస్ ఆడుదాం, అనే నినాదాలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. అనంతరం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు చెస్ బోర్డులను అందజేశారు. విద్యార్థులు ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, పీజీహెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి, వెంకటాచారి, మంజుశ్రీ, అశోక్ కుమార్, శైలజ తదితరులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

# బాలల ఉజ్వల భవిష్యత్తుకు డిజిటల్ వ్యసనాలు ప్రతిబంధకం

**-విద్యార్థులు సాంకేతికతను జ్ఞానార్జనకు మాత్రమే వినియోగించాలి**

**-టీజీఎస్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి**

కామారెడ్డి ,సెప్టెంబర్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బృందం బుధవారం విస్తృతంగా పర్యటించింది. కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు వచన్ కుమార్‌లతో కూడిన బృందం జంగంపల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, దోమకొండ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, పాల్వంచ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కామారెడ్డి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, సదాశివనగర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించింది. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటశాలలు, వసతి గృహాలు, డిజిటల్ ల్యాబ్‌లు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించడంతో పాటు విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. విద్యార్థి దశ భవిష్యత్తుకు పునాది వంటిదని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్లు, రీల్స్, సామాజిక మాధ్యమాల మితిమీరిన వినియోగానికి దూరంగా ఉండి, సాంకేతికతను జ్ఞానార్జనకు మాత్రమే వినియోగించాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. బాలల హక్కులకు ఎలాంటి భంగం కలిగినా భయపడకుండా ఉపాధ్యాయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే కమిషన్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు. విద్యార్థులపై మార్కుల కోసం ఒత్తిడి పెంచకుండా, వారిలోని సృజనాత్మకతను వెలికితీసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలిపారు. పాఠశాలల్లో స్నేహపూర్వక, ఒత్తిడి లేని వాతావరణాన్ని కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అనంతరం కమిషన్ బృందం రామారెడ్డి మండలంలోని శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లిఖార్జున్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు స్వర్ణలత, మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ సుజాత, జిల్లా బాలల రక్షణ అధికారి స్రవంతి, నాగవెందర్ కోఆర్డినేటర్, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా బాలల రక్షణ విభాగం సిబ్బంది, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాడిచన్ పల్లి పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాష దినోత్సవం

**-కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు**

పాపన్నపేట, సెప్టెంబర్ 09:(తెలంగాణ పత్రిక)



పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను పొడిచన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి మాట్లాడుతూ.. అన్యభాశల నేర్చి ఆంధ్రంబు రాధానుచు సఖిలించు ఆంధ్రుడా అంటూ తెలుగు ప్రజలను చైతన్యపరిచిన మహానీయుడు కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. తెలంగాణ యాస, భాష గొప్పతనాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపై ఉందన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు డాక్టర్ బి. దేవయ్య మాట్లాడుతూ.. బడి పలుకుల భాష కాదు.. పలుకు బడుల భాష కావాలి అని ఆకాంక్షించిన తెలంగాణ ప్రజాకవి కాళోజీ అని అన్నారు. నా గొడవ పేరుతో సమకాలీన సామాజిక సమస్యలపై ముక్కుసూటిగా స్పందిస్తూ, తన రచనల ద్వారా ఆనాటి పాలకులను ప్రశ్నించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కాళోజీ రచించిన కవితలను ఆలపించి ఆయన సాహిత్య స్ఫూర్తిని చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి. శ్రీనివాస్ గౌడ్, కె కిషన్, కె శివశంకర్, పిడి కె. మహిపాల్, కంప్యూటర్ ఆపరేటర్ పాషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలి

**-సదాశివనగర్ సిఐ వీరయ్య**

కామారెడ్డి ,సెప్టెంబర్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




కామారెడ్డి జిల్లా సదాశివనగర్ గాంధారి తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సదాశివనగర్ సీఐ వీరయ్య తెలిపారు. గణేష్ మండపాల నిర్వహణకు సంబంధించిన పోలీస్ శాఖ రూపొందించిన ఆన్లైన్ ఇంటిమేషన్ విధానం ద్వారా మండపాల వివరాలను ముందస్తుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. మండపాల వివరాలను ముందుగా పోలీసులకు తెలియజేయడం వల్ల ఆయా ప్రాంతాలలో భద్రత బందోబస్తు ఏర్పాటు చేయడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు ఆన్లైన్ ఇంటిమేషన్ నమోదుకు ఎలాంటి రుస్తుం లేదని స్పష్టం చేశారు గణేష్ మండపాల నిర్వాకులు కంప్యూటర్ లేదా మొబైల్ ద్వారా పోలీస్ శాఖ వెబ్ సైట్ లో వివరాలను నమోదు చేసి దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్ కు అందజేయాలని సూచించారు. గణేష్ మండపాలను ప్రజా రవాణాకు అత్యవసర వాహనాలు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు సంబంధిత శాఖల అనుమతులతో పాటు విద్యుత్ శాఖ అనుమతి తీసుకొని తర్వాత విద్యుత్ కనెక్షన్ పొందాలని తెలిపారు మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని గణేష్ మండపం వద్ద నిర్వాహకుల పేర్లు ఫోన్ నంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలని 24 గంటల పాటు కనీసం నలుగురు వాలంటరీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు మండపాల వద్ద బుక్కు ఏర్పాటు చేసుకోవాలని ఉదయం సాయంత్రం రాత్రి సమయంలో పోలీస్ సిబ్బంది పరిరక్షణకు వచ్చినప్పుడు నిర్వాహకులు సహకరించాలని సూచించారు గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రదేశంలో షెడ్డును నాణ్యతతో నిర్మించాలని విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదు. గణేష్ మండపాలల్లో శోభయాత్రల లోఎట్టి పరిస్థితుల్లోను డీజే లను ఏర్పాటు చేయరాదని సదాశివనగర్ సిఐ వీరయ్య స్పష్టం చేశారు. విద్యా సంస్థలు ఆసుపత్రిలో ప్రార్థన మందిరాలు వృద్ధులు. చిన్నపిల్లలకు ఇబ్బంది కలగకుండా పోలీసుల అనుమతితో చిన్న స్పీకర్లను మాత్రం వినియోగించాలని సూచించారు మండపాల వద్ద భక్తు గీతాలను మాత్రమే ప్లే చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించుకోవాలని తెలిపారు. మండపాల వద్ద మద్యం సేవించడం జూదం ఆడడం అసభ్యకరంగా నృత్యాలు నిర్వహించడం. ఇతరులను కించపరిచేలా ప్రసంగాలు లేదా పాటలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. మండపాల వద్ద అనుమానాస్పద బ్యాగులు వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డైల్ 112 లేదా తాడ్వాయి గాంధారి సదాశివ నగర్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. మండపాల వద్ద నిర్వహించే సంస్కృతి ఇతర కార్యక్రమాల వివరాలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. గణేష్ ప్రతిష్టాపన రోజున నిర్ణీత సమయానికి విగ్రహాన్ని మండపానికి చేర్చేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు నిమర్జనం శోభయాత్రను మధ్యాహ్నం నుంచే ప్రారంభించి నిర్ణయించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలి. ఇతరులపై రంగులు చల్ల రాదని ఇతరులను కించపరిచేలా నినాదాలు చేయరాదని సూచించారు శోభయాత్రలు టపాసులు పేల్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు డ్రైవర్ కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎక్కడైనా ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరుగుతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి గ్రామంలో పోలీస్ సిబ్బంది ముమ్మరంగా పెట్రోలింగ్ జరుగుతుందన్నారు. మహిళలు పిల్లలకు ఇబ్బందులు కలిగించే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని పోలీస్ శాఖ సూచించిన నియమ నిబంధనలను పాటిస్తూ గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించే ందుకు నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని సదాశివనగర్ సీఐ వీరయ్య కోరారు.

# విద్యార్థులకుపెండింగ్ ఫీజు బకాయాలను విడుదల చేయాలి

**-4 సంవత్సరాల నుండి ఫీజు బకాయిలు రాక ఇబ్బందులు**

కామారెడ్డి, సెప్టెంబర్ 9, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ ప్రాంగణంలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు పట్టణంలోని అన్ని డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యాలు పెండింగ్ ఫీజు బకాయాలను విడుదల చేయాలని కోరుతూ మానవహారం నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ అధ్యయన సమాలోచన కేంద్రం టాస్క్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బాలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరి వల్ల లక్షలాదిమంది విద్యార్థులు కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కోర్సులు పూర్తి అయిన ఫీజు బకాయలు రాకపోవడంతో కళాశాలలో సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉన్నదని అన్నారు. 2021 సంవత్సరం చెల్లించాల్సిన ఫీజు బకాయలు చెల్లించకుండా 2026 బకాయిలను విడుదల చేస్తానని చెప్పి విద్యార్థులను మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కిందన్నారు,చరిత్రలో విద్యార్థులను,నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వాలు అన్ని అధికారాన్ని కోల్పోయాయని,అదే పరిస్థితి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తుందని అన్నారు.ప్రజా పాలన పేరుతో దగా పాలన చేస్తూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం



చేస్తామని దానికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల అధ్యాపకులు అమృత దత్తాద్రి,సాయిబాబా,కొడిపాక సత్యనారాయణ,విజయ్ కుమార్,మనోజ్ కుమార్,అనిల్ రెడ్డి,తిరుపతి రెడ్డి,బాబర్, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల వైఖరి దుర్మార్గం: తీవ్రంగా ఖండించిన మాజీ మార్కెట్ చైర్మన్ అల్లం దేవమ్మ

జగిత్యాల: తెలంగాణ పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 09-2026



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలోకి వెళ్తున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా ఎమ్మెల్యేలు శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి, శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గార్ల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు శ్రీమతి అల్లం దేవమ్మ గారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చట్టసభలకు వెళు_న్న గౌరవప్రదమైన మహిళా ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం, వారి పట్ల పోలీసులు అహంకారపూరితంగా, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గొంతు విప్పేందుకు వస్తున్న మహిళా నాయకులను అణచివేయాలని చూడటం కాంగ్రెస్ ప్రభుత్వ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. "తెలంగాణ సమాజంలో మహిళా నాయకులకు ఇచ్చే గౌరవాన్ని దిగజార్చేలా పోలీసుల ప్రవర్తన ఉంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకే రక్షణ మరియు గౌరవం లేకపోతే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏమిటి?" అని ఆమె ప్రశ్నించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల దురహంకారంతో వ్యవహరించిన సదరు పోలీసు అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం వారి పట్ల క్షమాపణ చెప్పాలని అల్లం దేవమ్మ డిమాండ్ చేశారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**-మట్టి విగ్రహాల పంపిణీ చేపట్టిన సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్.కె.వై ఫౌండేషన్**

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, సెప్టెంబరు 09, (తెలంగాణ పత్రిక)





వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. మట్టి గణపతి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. మసీద్‌బండ లోని బీజేపీ కార్యాలయంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్.కె.వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవికుమార్ యాదవ్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తి, సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. "మట్టి గణపతిని పూజిద్దాం.. మన పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. మట్టి విగ్రహాల పంపిణీ ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## బాల్యవివాహాలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు

**-సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు**



భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9

బాల్యవివాహాలు నిర్వహించిన సహకరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు సూచించారు. బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవం గా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన నవంబర్ 27వ తారీకు ను పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ సభ్యులు ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఎవరైనా బాల్యవివాహాలు చేసిన సహకరించిన వారిపై బాల్య వివాహ నిరోధక చట్టం మరియు పోక్సో యాక్ట్ కూడా విధించబడుతుందని తెలిపారు. బాల్యవివాహాలు జిల్లాలో ఎక్కడైనా జరుగుతున్నట్టు సమాచారం తెలిసినట్లయితే వెంటనే 1098 లేదా డయల్ 100 లేదా జస్ట్ రైట్స్ వారికి తెలియజేయాలని కోరారు, ఈ కార్యక్రమానికి ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్ సభ్యులు మోహన్ మాన్సింగ్ రవిచంద్ర నాగేంద్రబాబు మౌనిక పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక నిజం మా నిజన్


# వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

-జీడిమెట్లలో మండపాల నిర్వాహకులతో ఏసీపీ సమన్వయ సమావేశం



తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 9:
రాబోయే వినాయక చవితి పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని కుత్బు ల్లాపూర్ డివిజన్ ఏసీపీ సూచించారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులు, ప్రజలతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మండపాల నిర్వాహకులతో మాట్లాడి పండుగ నిర్వహణకు సంబంధించిన పలు సూచనలు చేశారు. అధిక శబ్దం వచ్చే సౌండ్ సిస్టమ్‌లు, వాయిద్యాలను వినియోగించకుండా, సాధ్యమైనంత వరకు సంప్రదాయ బ్యాండ్‌లు, వాయిద్యాలకే ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పండుగ సందర్భంగా మద్యం సేవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని నిర్వాహకులు, భక్తులకు స్పష్టం చేశారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా చెరువులు, కుంటలు, ఇతర నిమజ్జన ప్రదేశాల వద్ద భక్తుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వినాయక చవితి వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా జరిగేలా మండపాల నిర్వాహకులు, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏసీపీ సూచించారు. సమావేశంలో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె. రవికుమార్, సెక్టార్ ఎస్‌ఐలు ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్, శ్యామ్‌బాబు, రామచంద్రయ్యతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ముదిరాజులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

-బీసీ-డీ నుంచి ఏబీసీకి మార్చే హామీని నిలబెట్టుకోవాలి
-జిల్లా ప్రధాన కార్యదర్శి కొరివి నర్సింహులు

కామారెడ్డి, సెప్టెంబర్ 9 , (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)
గతంలో ఎన్నికల సమయంలో ముదిరాజులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కామారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరివి నర్సింహులు డిమాండ్ చేశారు. బీసీ-డీ నుంచి ఏబీసీ కేటగిరీకి మారుస్తామని గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మానం చేసి అమలు చేయాలని కోరారు.బీబీపేటలో కూడా ముదిరాజులను బీసీ-డీ నుంచి ఏబీసీకి మారుస్తామని హామీలు ఇచ్చిన సందర్భాలను ఆయన గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చాలని, ముదిరాజ్ సోదరుల ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. అదేవిధంగా అర్హులైన ముదిరాజులకు బీసీ



రిజర్వేషన్లతో పాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఇల్లు లేని వారికి ప్రత్యామ్నాయంగా అదనంగా రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ముదిరాజ్ సంఘం కోసం కనీసం ఒక భవనం నిర్మించాలని కోరారు.రాష్ట్రంలో ముదిరాజుల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ తమ సామాజిక వర్గానికి తగిన ప్రాతినిధ్యం, ప్రభుత్వ శాఖల్లో అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. ముదిరాజ్ బంధు పథకం, పింఛన్ వంటి సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో ముదిరాజులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. గుడి కమిటీ చైర్మన్‌లు తదితర పదవుల్లో కూడా ముదిరాజులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముదిరాజులకు న్యాయం చేయకపోతే రాబోయే ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని కొరివి నర్సింహులు హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముదిరాజులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు.

# ఏరియాలో ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9
కొత్తగూడెం ఏరియా పరిధిలోని జిఎం కార్యాలయము నందు ప్రజా కవి, స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ ఉద్యమ నాయకుడయిన కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం ఏరియా జిఎం సిహెచ్ వెంకటరమణ ముందుగా కాళోజీ నారాయణ రావు చిత్ర పటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు .ఈ సంధర్భముగా జిఎం మాట్లాడుతూ కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను జరుపుకోవటం చాలా సంతోషకరం అని కాళోజీ నారాయణ రావు పూర్తి పేరు రఘువీర్ నారాయణ లక్ష్మీకాంత్ శ్రీనివాస రామ్ రాజా కాళోజి స్వాతంత్ర తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని కవిత్వం వ్రాసిన ప్రజాకవి అని ఆయన పుట్టిన రోజుని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించారని భారత ప్రభుత్వం ఆయన చేసిన సేవలకు గాను 1992లో భారతదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ తో సత్కరించారని తెలిపారు. కాళోజీ నారాయణ రావు 1914 సెప్టెంబర్ 9న కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా రట్టిహళ్లి గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి రంగారావు మహారాష్ట్రకు చెందినవారు, తల్లి రమాబాయమ్మ కన్నడ. చిన్నవాటి నుంచే ఆయనకు సాహిత్యం, సామాజిక చైతన్యం పట్ల ఆసక్తి పెరిగిందని అన్నారు. ఆయన పూర్తి పేరు రఘువీర్





నారాయణ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజి ని, వారు తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, ఇంగ్లీషు భాషల్లో ప్రావీణ్యం కలిగిన బహుభాషా రచయిత అని అన్నారు. ఆయన రచనలు సామాజిక సమస్యలపై కఠినమైన విమర్శలతో, వ్యంగ్యంతో నిండివుంటాయని అన్నారు. 'నా గొడవ' అనే కవితా సంపుటి ఆయనకు ప్రజాకవి బిరుదు తెచ్చిపెట్టిందని, ఆయన కవిత్వం తెలంగాణ ప్రజల ఆవేదన, ఆగ్రహం, ఆశలను ప్రతిబింబించిందని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు ఒ ఉద్యమకారుడని వారు నిజాం దమనకాండకు వ్యతిరేకంగా పోరాడి జైలుశిక్ష అనుభవించారని, తెలంగాణలో అక్షరజ్యోతి వ్యాప్తి కోసం గ్రంథాలయోద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. వారు 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చాడని వారికి 1992లో భారతదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ అందుకున్నారని అన్నారు. వరంగల్ లోని ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టబడిందని వారు అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి, అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి అని ఆయన గర్వంగా ప్రకటించాడు. ఆయన జీవితం మొత్తం ప్రజల హక్కుల కోసం అంకితం అయిందని అన్నారు. కాళోజీ జీవితం మనకు స్ఫూర్తి, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ, తెలంగాణ భాష, సంస్కృతి, హక్కులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జిఎం తో పాటు ఎఐటియూసి బ్రాంచ్ సెక్రెటరీ జే. గట్టయ్య, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, అధికారుల సంఘం కొత్తగూడెం ఏరియా జాయింట్ సెక్రెటరీ ఏ. ఉపేంద్ర బాబు, ఎస్ఓటు జిఎం ఎం. గోవింద రావు, ఇన్చార్జి ఏరియా ఇంజనీర్ జే. క్రిస్టఫర్, డిజిఎం (ఫైనాన్స్) ఐ సుధీర్, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి జిఎం కార్యాలయ వివిధ విభాగల అధిపతులు, అధికారులు, సిబ్బంది కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా కాళోజి జయంతి వేడుకలు

-నగర మేయర్ మహంకాళి స్వామి



తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 09 రామగుండం :
రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కాళోజీ నారాయణ రావు 112వ జయంతి ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా కవి, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత తెలంగాణ కోసం జరిగిన పోరాటల్లో పాల్గొనడంతో పాటు తెలంగాణ భాష, యాస, సంస్కృతి ప్రత్యేకతను తన రచనలా ద్వారా చాటి చెప్పిన గొప్ప వ్యక్తి కాళోజీ నారాయణ రావు అని అన్నారు. అయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,నగర పాలక సంస్థ సిబ్బంది , పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం

-నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష
-రూ.3 వేల జరిమానా.. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం

తెలంగాణ పత్రిక, హైదరాబాద్, సెప్టెంబర్ 9:
మైనర్ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 3 వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని రేప్, పోక్సో కేసుల విచారణ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023లో ఈ ఘటన చోటుచేసుకుంది. కొండాపూర్‌లో నివసిస్తూ సెంట్రింగ్ పని చేస్తున్న మీనగల వేణుగోపాల్ అలియాస్ వేణు (45) ఇంటి సమీపంలో నివసించే రెండో తరగతి చదువుతున్న మైనర్ బాలికను తన గుడిసె వద్దకు తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ విషయం ఎవరికీ చెప్పవద్దంటూ బాలికను నిందితుడు బెదిరించినట్లు



పోలీసులు తెలిపారు. బాధితురాలు ఈ విషయాన్ని తల్లి, కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఆమె తల్లి 2023 మే 16న గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో సేకరించిన ఆధారాల్లో మానవ వీర్యం, శుక్రకణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. బాధితురాలి దుస్తులు, నిందితుడు ఉపయోగించిన దుప్పటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు, ఇతర సాక్షులు, పోలీసు అధికారులు, ఫోరెన్సిక్ నిపుణుల వాంగ్మూలాలను నమోదు చేశారు. నిందితుడు వేణుగోపాల్‌ను 2023 మే 18న అరెస్టు చేసి, సమగ్ర దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 3 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్టమైన ఆధారాల సమర్పణతో నిందితుడికి శిక్ష పడేలా పోలీసులు చర్యలు చేపట్టారు. మాధాపూర్ డివిజన్ ఏసీపీ పి. శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్‌రెడ్డి న్యాయస్థానంలో సమర్థవంతమైన వాదనలు వినిపించి కేసు బలంగా ముందుకు సాగేందుకు కృషి చేసినట్లు సైబరాబాద్ డీసీపీ (క్రైమ్స్) తెలిపారు.

# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన బిఆర్ఎస్ నాయకులు

?మంగపేట,సెప్టెంబర్ 09(తెలంగాణ పత్రిక):
మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన మాలోత్ స్వాతి-యాకూబ్ దంపతుల కుమారులు వినయ్, రాజేష్ ములుగు గణేష్‌లాల్ గ్రామంలో చెరువులో పడి ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న కమలాపురం బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్ సమక్షంలో, మైనారిటీ సెల్ నాయకుడు ఎండీ ఫిరోజ్ ఖాన్ బాధిత



కుటుంబాన్ని పరామర్శించారు. పిల్లల దశదిన కర్మ సాయం నిమిత్తం 25 కేజీల బియ్యం, 5 కేజీల నూనె, పేపర్ ప్లేట్లు, గ్లాసులను కుటుంబానికి అందజేసి, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పప్పు వెంకట్ రెడ్డి, ఎస్కె ఖుర్బన్ అలీ, చీకుర్తి సుధాకర్, గాదె శ్రీనివాస చారి, గోమాస చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ మాండలిక భాషా దినోత్సవం

మంగపేట, సెప్టెంబర్ 09( తెలంగాణ పత్రిక):

మంగపేట మండలం కమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజానాయకుడు కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ మాండలిక భాషా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు గడ్డి శ్రీనివాస్ నాయకత్వంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు తెలంగాణ నేల కళలు, ఆచారాలు, సాంస్కృతిక వైవిధ్యాన్ని కళ్లకు కట్టేలా ప్రదర్శనలు ఇచ్చారు. బతుకమ్మ, బోనాలు, మేరీ మాత, పీరీలు, తీజ్ బుట్టల ప్రదర్శనలతో పాటు లంబాడీ సంప్రదాయ నృత్యం, కోయ నృత్యం, రైతు వేషధారణ, పోతురాజు పాత్రలతో పాఠశాల ప్రాంగణాన్ని అలరించారు. అనంతరం పాఠశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు,



ఉపాధ్యాయులు కలసి ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని, వాటిని గౌరవిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, సునీత, నాగమణి, నాగలక్ష్మి, రాజేశ్వరరావు, రవీందర్, భూలక్ష్మి, మౌలాలిలతో పాటు భారీ సంఖ్యలో విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# లోతుకుంట తండాలో వినాయక మండపం నిర్మాణానికి శ్రీకారం

బొంరాస్ పేట్ తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 09:

బొంరాస్‌పేట్ మండలం లోతుకుంట తండాలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ యువత, భక్తులు, నిర్వాహకులు కలిసి వినాయక మండపం నిర్మాణ పనులను ప్రారంభించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేలా మండపాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.దమండపం నిర్మాణ పనులకు ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని యువత ఉత్సాహంగా ముందుకు వచ్చి మండపం నిర్మాణంలో పాల్గొంటున్నారు. పండుగ సందర్భంగా గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా చిన్నారులు, యువతతో పాటు గ్రామ ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొనేలా



కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. మండపాన్ని ఆకర్షణీయంగా అలంకరించడంతో పాటు విద్యుత్ దీపాలు, పూల అలంకరణ, రంగురంగుల అలంకరణలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో ఐక్యత, భక్తి భావాన్ని పెంపొందించేలా వినాయక ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువత ఆధ్వర్యంలో ప్రారంభమైన మండపం నిర్మాణ పనుల్లో గ్రామస్తులు కూడా తమ వంతు సహకారం అందిస్తున్నారు. పండుగ రోజుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ భద్రత వంటి అంశాలపై కూడా దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నిర్వాహకులు ప్రజలకు సూచించారు. ముఖ్యంగా చిన్నారులు మండపం వద్దకు వచ్చినప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ వైర్లు, అలంకరణ సామగ్రికి దూరంగా ఉండేలా చూడాలని కోరారు. లోతుకుంట తండాలో ప్రారంభమైన వినాయక మండపం నిర్మాణంతో గ్రామంలో పండుగ సందడి మొదలైంది. రానున్న రోజుల్లో మండపం నిర్మాణం పూర్తి చేసి గణనాథుడి ప్రతిష్ఠకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# నర్సు శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి

-న్యాయం కోసం పాదయాత్ర.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక సెప్టెంబర్9

బుధవారం ఆదివాసి 9 తెగలు, ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో పాదయాత్ర కొనసాగుతూ హైదరాబాదులో తుక్కగూడ ప్రాంతంలో గల ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో నర్సుగా ఉద్యోగం చేస్తున్న నర్సు శిరీష ను సానద్ ఉల్లా ఖాన్ అనే వ్యక్తి అత్యంత దారుణంగా కిరాతకంగా కొట్టి చంపి హత్యయత్నం చేయడం జరిగింది అందుకుగాను ఆదివాసీ 9 తెగల రాష్ట్ర చైర్మన్ చుంచు రామకృష్ణ గత నాలుగు రోజుల నుండి నర్సు కుటుంబానికి న్యాయం చేయాలని పాదయాత్ర ప్రారంభించడం జరిగినది .అందులో భాగంగా లక్ష్మీదేవి పల్లి మండలం కేంద్రానికి రావడం తో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు సనప కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి మండల కేంద్రంలో లోతువాగు నుండి పాదయాత్రలో పాల్గొనీ విజయవంతం చేసినారు లక్ష్మీదేవి పల్లి సర్పంచ్ తాటి అనిత ఈ సందర్భంగా వారికి సంఘీభావం తెలిపినారు చుంచు రామకృష్ణ మాట్లాడుతూ వారి కుటుంబానికి ఎక్స్గ్రేషియా కోటి రూపాయలు ఇవ్వాలని వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఐదు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని ఇంటి నిర్మాణాన్ని






చేసి ఇవ్వాలని ప్రవేటు ఆసుపత్రి పై చర్యలు తీసుకోవాలని ఇంతటి ఘాతుకానికి పాల్పడిన దుర్మార్గుడు ఎన్కౌంటర్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తూ ర్యాలీని పాదయాత్రను ముందుకు కొనసాగించి అనంతరం లక్ష్మీదేవిపాలెం మండల కేంద్రంలో పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేసినారు ఈ మాట్లాడుతూ వారి కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉండాలని సిబిఐ ఎంక్వయిరీ చేయించాలని ఆసుపత్రి పై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉండాలని ఈ సందర్భంగా హెచ్చరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు అలం కోటి మాట్లాడుతూ మహిళలపై ఇన్ని అన్యాయాలు అక్రమాలు జరుగుతున్న పట్టించుకోకుండా మీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మహిళలకు రక్షణ కల్పించే విధంగా ఉండాలని ఈ సందర్భంగా మాట్లాడారు ఎందరో అమాయకులు ఆడపిల్లలు బుధవారం చదువుల రీత్యా ఉద్యోగాల రీత్యా పట్టణాలకు వెళుతున్న సందర్భంగా ఇలాంటి ఆగాయిత్యాలు జరగడంతో తల్లిదండ్రులు వారి పిల్లల్ని పంపడానికి భయభ్రాంతులకు గురవుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు నిందితుడిని అరెస్టు చేయడం కాదు అతడిని వెంటనే ఎన్కౌంటర్ చేయాలని మరొక ఇలా జరగకుండా చూడాలని కోరారు ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రావు కొత్తగూడెం డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనరసు వాసన నవతన్, కొమరం గౌతం ఆదివాసీ సోదరులు పాల్గొన్నారు, విద్యార్థి సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

# యామిని ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి

-బాలుడి మృతిపై ఆరోపణల నేపథ్యంలో సమగ్ర విచారణ జరపాలి

-ఆసుపత్రిని సీజ్ చేసి నిజానిజాలు వెలికితీయాలని బాధిత కుటుంబం డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9 (తెలంగాణ పత్రిక):

పసి బాలుడి మృతికి సంబంధించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న యామిని ఆసుపత్రిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. బాలుడికి చికిత్స అందించినట్లు చూపిస్తూ బిల్లులు వసూలు చేశారనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. బాలుడి మృతికి అసలు కారణం ఏమిటి? చికిత్సలో వైద్యపరమైన నిర్లక్ష్యం జరిగిందా? మృతిచెందిన బాలుడికి చికిత్స అందించినట్లు చూపించి బిల్లులు వసూలు చేశారా? అనే అంశాలపై అధికారులు పారదర్శకంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని బాధిత కుటుంబం కోరుతోంది.



ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణపై అధికారులు కఠినంగా పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. యామిని ఆసుపత్రిని వెంటనే సీజ్ చేసి, పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆసుపత్రికి ఉన్న అనుమతులు, వైద్య సేవల నిర్వహణకు సంబంధించిన పత్రాలను కూడా పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. బాలుడి మృతిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి విచారణకు ఆదేశించాలని బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. అధికారుల చర్యల కోసం బాధిత కుటుంబం ఎదురుచూస్తోంది.

## కాళోజి సాహిత్యం ప్రజా జీవనానికి అద్దం



తెలంగాణ పత్రిక, సెప్టెంబర్ 09 కామారెడ్డి ప్రతినిధి:

ప్రజాకవి కాళోజి నారాయణరావు సాహిత్యం ప్రజల జీవన విధానానికి, ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టిందని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. ఆయన ఆలోచనలు, రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ విక్టర్ కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళోజి తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజా సమస్యలకు బలమైన స్వరం అందించారని తెలిపారు. తెలంగాణ సమాజంలో సామాజిక చైతన్యం, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు ఆయన విశేష కృషి చేశారని అన్నారు. ప్రజల పక్షాన నిలిచి సామాజిక న్యాయం కోసం కాళోజి చేసిన పోరాటం, సాహిత్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాళోజి రచనల్లో సామాన్య ప్రజల జీవితం, వారి సమస్యలు, ఆకాంక్షలు ప్రతిబింబించాయని తెలిపారు. సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించిన మహనీయుడిగా కాళోజి నిలిచారని అన్నారు. ఆయన సాహిత్య స్ఫూర్తిని యువత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో పాండు, డీఎంహెచ్ఓ వెంకటేష్, ఆర్డీఓ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నర్సయ్య, అసిస్టెంట్ బీసీ అభివృద్ధి అధికారి చక్రధర్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు సాపా శివరాములు, కొంగర వెంకటి, నాగభూషణం, ఎంబీసీ నాయకులు శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న మంచిర్యాలలో ఆత్మీయ సమావేశం



తెలంగాణ పత్రిక, సెప్టెంబర్ 09 మందమర్రి:

జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి,ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఆత్మీయ సమావేశం సెప్టెంబర్ 10న మంచిర్యాలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చలో మంచిర్యాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం మందమర్రి స్థానిక ప్రెస్ క్లబ్‌లో జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆవుల సాగర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మంతెన సంపత్ కుమార్,చెన్నూర్ నియోజకవర్గ నాయకులు జీవన్ వడ్లకొండ, రాష్ట్ర అధికార ప్రతినిధి మూలా హరీష్ గౌడ్ హాజరయ్యారు. అలాగే చెన్నూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు పిట్టల సుధాకర్, రాసమల్ల రాజేష్, వాసాల అజయ్, చరణ్, పవన్ తదితరులు పాల్గొ న్నారు. సెప్టెంబర్ 10న మంచిర్యాలలో నిర్వహించనున్న ఈ ఆత్మీయ సమావే శానికి జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ నేతలపై బిఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

తెలంగాణ పత్రిక సెప్టెంబర్ 9 పెద్దపల్లి ప్రతినిధి:




తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు దిష్టి బొమ్మను మంగళవారం ధర్మారం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు కలిసి ఉద్దేశ్యపూర్వకంగా దహనం చేయడాన్ని నిరశిస్తూ మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశంతో బుధవారం బిఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధకుడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను అవమానిస్తూ దిష్టిబొమ్మను దహనం చేయడం అప్రజాస్వామికమని, ప్రజా జీవితంలో ఉన్న రాజకీయ నాయకుడిని ఉద్దేశించి బహిరంగంగా దిష్టిబొమ్మ దహనం చేయడం ద్వారా రాజకీయ ఉద్రిక్తతలు, ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు, సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోస్టు చేయడం జరిగిందనీ. ఇతర ఆధారాలు పోలీసుల దర్యాప్తుకు అవసరమైనప్పుడు సమర్పించడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు రాచూరి శ్రీధర్, కూరపాటి శ్రీనివాస్ నాయకులు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, తుమ్మల రాంబాబు, ఎగెల స్వామి, కార్యకర్తలు యువకులు,మహిళలు పాల్గొన్నారు.